


దర్జాగా కబ్జా

అక్రమార్కుల ఆగడాలకు అడ్డుఅదుపూ లేకుండా పోతోంది. ఎక్కడ ఖాళీ స్థలం కనిపించినా కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని లక్షలు సంపాదిస్తున్నారు. ఇంత జరుగుతున్నా సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలున్నాయి. పత్తికొండ పట్టణంలో 90 సెంట్ల స్థలాన్ని గతంలో సివిల్ సప్లై గోదాము నిర్మాణానికి అధికారులు కేటాయించారు. ఆ విలువైన స్థలంపై అక్రమార్కుల కన్ను పడింది. కబ్జా చేసేందుకు యత్నించినా మండగేరి వాసులు అడ్డుకున్నారు. సర్వే నెంబరు 306-3లో 5.1ఎకరా, 306-4లో 3.51 ప్రభుత్వ భూములున్నాయి. వీటిలోని కొంతభాగంలో వృద్ధాశ్రమం, దేవాలయం నిర్మించారు. మిగిలిన స్థలంలో కూడా పట్టాల రూపంలో అమ్ముకునేందుకు అక్రమార్కులు రంగం సిద్ధం చేసుకున్నారు.


ఆదోని రహదారిలోను 612-2 స్థలంలో బండలు పాతుతున్న దృశ్యం

- రెచ్చిపోతున్న అక్రమార్కులు
- ఆక్రమణకు గురవుతున్న కోట్ల విలువ చేసే భూములు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ అధికారులు

పత్తికొండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూములను అక్రమార్కులు దర్జాగా కబ్జా చేస్తున్నారు. ఆదోని రహదారిలో ప్రధాన రోడ్డు పక్కన ఉన్న 90 సెంట్ల స్థలంతో పాటు, ఆర్టీసీ డిపో సమీపంలో ఉన్న సుమారు మూడెకరాల స్థలంలో కన్నేసిన అక్రమార్కులు దర్జాగా వాటిని అమ్ముకొని సొమ్ముచేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ శాఖాధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఆశాఖలో పనిచేస్తున్న అధికారుల సహకారంతోనే ఈ తతంగం జరుగుతోందన్న ఆరోపణలున్నాయి.

సివిల్ సప్లై గోదాముకు కేటాయించిన స్థలం

పట్టణంలో ఆదోని రహదారిలో గల మండగేరి గ్రామపంచాయతీ సర్వే నెంబరు 616-2లో సుమారు 90 సెంట్ల స్థలాన్ని గతంలో సివిల్ సప్లై గోదాము నిర్మాణానికి అధికారులు కేటాయించారు. గతంలో పని చేసిన కలెక్టరు, జాయింట్ కలెక్టరు కూడా ఈ స్థలాన్ని పరిశీలించారు. ఆ స్థలంలో గోదాము నిర్మాణం పెండింగ్ పడడంతో ప్రధాన రహదారి పక్కన ఉన్న ఆ విలువైన స్థలంపై అక్రమార్కుల కన్ను పడింది. ఆరు నెలల క్రితమే ఆస్థలంలో రాళ్లు పాతి ప్లాట్లు వేసేందుకు ప్రయత్నించారు. మండగిరికి చెందిన ప్రజలు తమ గ్రామ పరిధిలో గల ఆ స్థలంలో తమ గ్రామస్థులకే పట్టాలు కేటాయించాలని రాళ్లను తొలగించి ఆందోళనకు దిగారు. ఈ విషయంపై విచారణ చేసిన రెవెన్యూ అధికారులు ఆ స్థలంలో ఎవరికి పట్టాలు ఇవ్వమని, ప్రభుత్వ నిర్మాణాలకు వాడుకుంటామని వారికి తేల్చి చెప్పారు.


ఆర్టీసీ డిపో వద్ద 306కు సంబంధించిన స్థలంలో ఓ భాగం

నకిలీ పత్రాలు అడ్డుపెట్టుకుని..

పది రోజుల క్రితం హోసూరుకి చెందిన వైసీపీ నాయకుడు 1998లోనే తనకు 6 సెంట్ల స్థలం కేటాయించినట్లు నకిలీ పత్రాలు అడ్డుపెట్టుకుని స్థలాన్ని చదును చేసుకునేందుకు ప్రయత్నించాడు. పోలీసులు చదును చేసే యంత్రాన్ని స్టేషన్‌కు తరలించారు. పత్రాలను పరిశీలన కోసం తహసీల్దార్ కార్యాలయానికి పంపారు. ఇప్పటి వరకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టడం గాని, దానిపై వివరణ ఇవ్వడం గాని చేయలేదు.



పట్టాలు కేటాయించ లేదు

616-2లోగాని 306-3, 306-4లోగాని మేము ఎలాంటి పట్టాలను మంజూరు చేయలేదు. గతంలో తమకు పట్టాలు మంజూరు చేశారని, కొందరు ఆ స్థలాలను చదును చేస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. ఈవిషయంపై పూర్తిస్థాయి విచారణ చేస్తున్నాం. అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

- హుస్సేన్ సాహెబ్, తహసీల్దారు, పత్తికొండ

వారం రోజుల క్రితం..

కోట్లు విలువ చేసే స్థలంపై కన్నేసిన అక్రమార్కులు వారం రోజుల క్రితం తిరిగి రాళ్లు పాతి ఆస్థలాన్ని విక్రయించినట్లు తెలిసింది. 90 సెంట్లలో 20 మందికి 20ప్లాట్లుగా అనధికార లేఅవుట్ కూడా పూర్తిచేసినట్లు సమాచారం. ఇందుకు రెవెన్యూ అధికారులు తమవంతు సహకారం చేసినట్లు తెలిసింది. గతంలో ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పనిచేసి ఆదోనికి బదిలీపై వెళ్లిన ఓ అధికారి అక్కడ అవినీతి అక్రమాలకు పాల్పడుతూ సస్పెండ్ అయ్యారు. సదరు అధికారి ఈ స్థలంలో పట్టాలు ఇచ్చినట్లు అక్రమార్కులు రెవెన్యూ అధికారుల సహకారంతో నకిలీ రికార్డులు సృష్టించినట్లు సమాచారం.

సుమారు ఎకరా స్థలం..

పట్టణంలోని సర్వేనెంబరు 306-3లో 5.1ఎకరా, 306-4లో 3.51 ప్రభుత్వ భూములున్నాయి. ఈ స్థలాన్ని గతంలో ఇరిగేషన్ శాఖకు స్థలం కేటాయించగా కార్యాలయ నిర్మాణం జరగలేదు. ఇదే ప్రాంతంలో వృద్ధాశ్రమ నిర్మాణానికి గతంలో స్థలం మంజూరు చేయడంతో ఆశ్రమాన్ని ఏర్పాటుచేశారు. మరోవైపు అమ్మవారి దేవాలయాన్ని ఏర్పాటుచేయడంతో సుమారు ఎకరా స్థలం దేవాలయం హద్దులుగా జెండాలు పాతారు. గత ప్రభుత్వ హయాంలో మండలస్థాయి ప్రజాప్రతినిధి తన అనుచరులతో కలిసి భూమిని పట్టాలుగా మార్చి లక్షల రూపాయలకు అమ్ముకున్నాడు. ప్రస్తుతం మిగిలిన స్థలంలో కూడా పట్టాల రూపంలో అమ్ముకునేందుకు అక్రమార్కులు రంగం సిద్ధం చేసుకున్నారు.

నేటి నుంచి టెట్

- జిల్లాలో 39,485 మంది అభ్యర్థులు
- మొత్తం 10 పరీక్ష కేంద్రాలు

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు జిల్లాలో 39,485 మంది అభ్యర్థులు ఆన్‌లైన్ పరీక్ష రాయనున్నారు. బుధవారం నుంచి ఈపరీక్ష డిసెంబరు 21వ తేదీ వరకు కొనసాగనుంది. పరీక్ష మొదటి సెషన్ ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మొత్తం 116 సీజన్స్ (పేపర్స్) కొనసాగుతుంది. మొత్తం పది పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా. జిల్లాలో ఐదు సెంటర్లు ఉన్నాయి. ఆదోనిలో భీమా ఇంజనీరింగ్ కాలేజీ, ఎమ్మిగనూరులో సెయింట్ జోన్స్ ఇంజనీరింగ్ కాలేజీ, కర్నూలులో పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల, డా.కేవీ సుబ్బారెడ్డి, ఐయాన్ డిజిటల్ జోన్, ఐడీ జెడ్ దూపాడులలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశారు. హైదరాబాదులో ఐదు పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాలకు అరగంట ముందే చేరుకోవాలి. ఉదయం 7 నుంచి సాయంత్రం 5గంటల వరకు అభ్యర్థులకు ఏదైనా సందేహాలుంటే హెల్ప్‌డెస్క్ సంప్రదించి నివృత్తి చేసుకోవాలని డీఈవో శామ్యూల్ పాల్ పేర్కొన్నారు. నెంబర్లు 8121821266, 9032397231, 3603683182ను సంప్రదించాలన్నారు.

జెడ్ పథకాన్ని వినియోగించుకోండి

- జిల్లా పరిశ్రమల శాఖ జీఎం అశోక్‌కుమార్



మాట్లాడుతున్న జిల్లా పరిశ్రమల శాఖ జీఎం అశోక్‌కుమార్

కర్నూలు రాజ్‌విహార్ సర్కిల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) నిర్వాహకులు జీరో ఎఫెక్ట్, జీరో డిఫెక్ట్ (జెడ్) కార్యక్ర మాన్ని సద్వినియోగించుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్(జీఎం) అశోక్‌కుమార్ తెలిపారు. మంగళవారం కార్యాలయంలోని సమావేశ భవనంలో జెడ్ పథకంలో పేర్ల నమోదు, ధ్రువపత్రాలతో కలిగే ప్రయోజనాలపై జెడ్ సీఈవో కల్లా జగపతి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యం పథకంలో భాగస్వాములైన ఎంఎస్‌ఎంఈల నిర్వాహకులు ఇందుకు అర్హులన్నారు. జెడ్ పథకంలో నమోదు కావటంతో పర్యావరణ హిత ఉత్పత్తులకు ప్రోత్సాహం లభిస్తోందన్నారు. జెడ్ ధ్రువీకరణతో అక్కడ పనిచేసే సిబ్బందికి ఉద్యోగ, ఆరోగ్య భద్రతతో పాటు పరిశ్రమలో భద్రతా ప్రమాణాలు మరింత మెరుగవుతాయని చెప్పారు. రుణాల మంజూరుకు జెడ్ ధృవీకరణ పత్రం తప్పనిసరి వివరించారు. ఎంఎస్‌ఎంఈ నిర్వాహకులు ఇందులో భాగస్వాములు కావాలన్నారు. జిల్లా పరిశ్రమల కేంద్రం ఉప సంచాలకులు జవహర్‌బాబు, జెడ్ ప్రతినిధులు రఘు, రసూల్, శేఖర్, ర్యాంప్ ప్రతినిధి పెర్సీ పాల్గొన్నారు.

యాంటీబయాటిక్స్‌తో జాగ్రత్త

- కలెక్టర్ డాక్టర్ సిరి
- పేదలకు రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం- ఎమ్మెల్యే గౌరు చరిత
- రూ.2.78 కోట్లతో డ్రగ్ కంట్రోల్ ఆఫీస్, ల్యాబ్ ప్రారంభం

కర్నూలు హస్పిటల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యాంటీ బయాటిక్స్‌ను పరిమితికి మించి వాడరాదని, వైద్యుల ప్రిస్క్రిప్షన్లు లేకుండా మందులు అమ్మరాదని కలెక్టర్ సిరి హెచ్చరించారు. మంగళవారం విజయవాడ నుంచి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ కర్నూలు, విశాఖపట్నం రీజనల్ లేబొరేటరీలు, డిప్యూటీ డైరెక్టర్ ఏడీ కార్యాలయాలను వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం సమీపంలో నూతనంగా రూ.2.78 కోట్ల వ్యయంతో నిర్మాణం చేసిన డిప్యూటీ డైరెక్టర్, జిల్లా డ్రగ్ కంట్రోల్ ఆఫీస్ రీజనల్ లేబొరేటరీ భవనాలను కలెక్టర్ సిరి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ ఔషధ దుకాణాల యజమానులతో మాట్లాడుతూ నకిలీ, కాలం చెల్లిన మందులను అమ్మరాదని సూచించారు. యాంటీ బయాటిక్స్‌ను అధిక మోతాదులో ప్రజలు వాడుతున్నారని, దీని వల్ల రోగ నిరోధక శక్తి క్షీణించి ఇతర రోగాల బారిన పడుతున్నారన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నదన్నారు. అందులో భాగంగా పేద ప్రజలకు రూ.25 లక్షల వరకు ఖర్చయ్యే వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నదన్నారు. ప్రతి అనారోగ్య సమస్యకు మందులు వాడకుండా, ప్రకృతిపరంగా జబ్బును నయం చేసుకోవడం మంచిదన్నారు. అనంతరం రీజనల్ ల్యాబ్‌ను కలెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే పరిశీలించారు. కార్యక్రమంలో ఔషధ నియంత్రణ పరిపాలన డిప్యూటీ డైరెక్టర్ నాగ కిరణ్ కుమార్, జిల్లా డ్రగ్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ హరిహరతేజ, డీఎంహెచ్‌వో డా.ఎల్. భాస్కర్, డీసీహెచ్ఎస్ డా.జఫ్రుల్లా, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు హనుమన్న, జయరాముడు పాల్గొన్నారు.


డ్రగ్ కంట్రోల్ ఆఫీసును ప్రారంభిస్తున్న కలెక్టర్, పాణ్యం ఎమ్మెల్యే

ఖాతా వివరాలిస్తే కటకటాలే.. 6

ఇన్ గేట్‌లో కష్టమే
- 108 అంబులెన్స్‌కు దారి ఇవ్వని ఆటోలు
- పత్తాలేని ట్రాఫిక్ పోలీసులు, సెక్యూరిటీ 7

అనధికార లేఅవుట్లను క్రమబద్ధీకరించుకోండి

కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు



కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో అనధికార లేఅవుట్లు, ప్లాట్లను క్రమబద్ధీకరించుకోవాలని కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం కుడా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే 14 నియోజకవర్గాల్లో అనధికారింగా ఉన్న లేఅవుట్లు, ప్లాట్లకు నోటీసులు ఇచ్చామని అన్నారు. మంత్రాలయంలో అనేక లాడ్జీలు నిర్మించారని తనిఖీకి వెళ్లి యజమానులను అనుమతులు ఎవరు ఇచ్చారంటూ ఆరా తీశామన్నారు. పంచాయతీ అనుమతి కేవలం ఇంటి నిర్మాణం కోసమే ఉంటుందని, వాణిజ్య సముదాయాలకు కుడా అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. భవనాలు నిర్మించి కమర్షియల్‌గా వాడుకుంటున్న వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. పంచాయతీ అనుమతి తీసుకున్న వారందరూ కుడా కార్యాలయానికి వచ్చి అనుమతి తీసుకోవాలన్నారు. ఎల్ఆర్ఎస్ స్వయంగా తీసుకోకపోతే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని సోమిశెట్టి హెచ్చరించారు.

3,14,060 క్వింటాళ్ల పత్తి కొనుగోలు

- రైతుల ఖాతాలో రూ. 236 కోట్లు జమ
- ఏడీఎం నారాయణమూర్తి

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో ఇప్పటి దాకా 10,020 మంది రైతుల నుంచి 3,14,060 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు. ఈ పత్తికి సంబంధించి రూ.236.03 కోట్లును రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేసినట్లు ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు. ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతులు 5 లక్షల ఎకరాలకు పైగా పత్తి సాగు చేశారు. ఈ పంట కొనుగోలుకు సీసీఐ సంస్థ కర్నూలు జిల్లాలో మొదట కేవలం 6 కేంద్రాలను మాత్రమే ఏర్పాటు చేసింది. ఆ తర్వాత రైతుల నుంచి ఒత్తిడి ఎక్కువ కావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రస్తుతం ఆదోని, ఎమ్మిగనూరు, కోడుమూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లో 16 కొనుగోలు కేంద్రాలను సీసీఐ సంస్థ నిర్వహిస్తోంది. మొదట్లో కపాస్ కిసాన్ యాప్‌లో పత్తి అమ్మకానికి సంబంధించి తేదీని నమోదు చేసుకునే విషయంలో రైతులు కొంత ఇబ్బంది పడ్డారని, ప్రస్తుతం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో నమోదు ప్రక్రియ వేగంగా సాగుతోందని ఏడీఎం తెలిపారు. దీంతో పాటు గ్రామాల్లో ఈక్రాఫ్ నమోదు, పీఎం యాప్‌లో రైతుల పత్తి వివరాలు త్వరితగతిన వ్యవసాయ అధికారులు, సిబ్బంది పూర్తి చేస్తున్నారని తెలిపారు. రైతుల వద్ద ఉన్న పత్తిని పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామని ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు. రైతులు తొందరపడి దళారులు, వ్యాపారుల చేతిలో సాగు చేసిన పత్తిని పెట్టి నష్టపోవద్దని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా గ్రామాల్లోనూ, జిన్నింగ్ మిల్లుల్లోనూ రైతులు తెచ్చిన పత్తిని కొనుగోలు చేయడంలో ఎలాంటి అక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


పత్తిని పరిశీలిస్తున్న అధికారులు

పత్తి పరిశ్రమలో అగ్నిప్రమాదం

- రూ.2 కోట్లకు పైగా దగ్ధం
- మంటలను అదుపు చేసిన ఫైర్ సిబ్బంది

ఆదోని, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని బసాపురం రహదారిలో ఉన్న హరి కాటన్ జిన్నింగ్ పరిశ్రమలో మంగళవారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి, పత్తి నిల్వకు వేగంగా వ్యాపించాయి. ఈ ప్రమాదంలో ఎన్‌డీబీఎల్ అధినేత బత్తిని కుబేర్‌నాథ్, సద్గురు సాయి అధినేత పంపకు చెందిన పత్తి నిల్వలు పూర్తిగా దగ్ధమయ్యాయి. హరి పత్తి పరిశ్రమలో మధ్యాహ్నం జిన్నింగ్ చేస్తుండగా ఒక్కసారిగా నిప్పు రవ్వలు పత్తిపై పడడంతో వేగంగా మంటలు వ్యాపించినట్లు అక్కడ పని చేస్తున్న కార్మికులు తెలిపారు. అక్కడ ఉన్న నీటి ద్వారా మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ మంటలు మరింత ఉధృతమయ్యాయి. ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకునేలోపే జరగరాని నష్టం జరిగింది. మంటలు మరింత పెరగకుండా ఫైర్ సిబ్బంది చర్యలు తీసుకున్నారు. ఈ అగ్ని ప్రమాదంలో సుమారుగా రూ. 2 కోట్లకు పైగా ఆస్తి నష్టం వాటిల్లిందని ఎన్‌డీబీఎల్ అధినేత బత్తిని కుబేర్‌నాథ్ తెలిపారు.


కాలిపోయిన పత్తిని పరిశీలిస్తున్న ఫైర్ సిబ్బంది

డీఈవోగా సుధాకర్



కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో)గా ఎల్.సుధాకర్ నియమితులయ్యారు. వైజాగ్ జిల్లా భీమిలి పట్టణం డైట్ కళాశాలలో సీనియర్ అధ్యాపకుడిగా పనిచేస్తున్న ఎల్.సుధాకర్‌ను కర్నూలు జిల్లా డీఈవోగా నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం డీఈవోగా పనిచేస్తున్న శామ్యూల్ పాల్‌కు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. గతంలో కర్నూలు జిల్లా డీఈవోగా పని చేస్తున్న సామేల్ పదోన్నతిపై కడప ఆర్‌జేడీ బదిలీ కావడంతో ఆయన స్థానంలో శామ్యూల్ పాల్‌కు ఎఫ్ఏసీ బాధ్యతలను అప్పగించారు. అప్పటి నుంచి శామ్యూల్‌పాల్ కర్నూలు డీఈవోగా కొనసాగుతున్నారు.

మండల పీజీఆర్ఎస్‌ను వినియోగించుకోవాలి

కలెక్టర్ డాక్టర్ సిరి

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం మండల కేంద్రాల్లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ సిరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌తో పాటు అన్ని రెవెన్యూ డివిజినల్ కార్యాలయాలు, మండల రెవెన్యూ కార్యాలయాల్లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తారని పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులందరూ కలిసి పాల్గొంటారని, ప్రజల నుంచి వచ్చే ప్రతిఅర్జీని ఆన్‌లైన్ చేసి సంబంధిత శాఖకు పంపిస్తారని వివరించారు. అర్జీలకు రశీదుఇస్తారని, అందులో పొందుపర్చబడిన విధంగా నిర్దేశిత గడువులోపు ప్రజల సమస్యను సంబంధిత అధికారి పరిష్కరిస్తారని వెల్లడించారు.

నేడు జిల్లా వ్యాప్తంగా నిరసనలు

సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతూ బుధవారం జిల్లా వ్యాప్తంగా నిరసనలు చేపడుతున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య తెలిపారు. అన్ని నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో నిర్వహించే నిరసనలను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతుల సమస్యలను పరిష్కరించాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు. అధిక వర్షాలు, తుఫానుల కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలన్నారు. పత్తి పంటను క్వింటాకు రూ.12 వేల చొప్పున ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పత్తిలో తేమశాతం 12 శాతం నుంచి 20 శాతానికి పెంచి సీసీఐ ద్వారా కొనుగోలు చేయాలన్నారు. ఆస్పరిలో జరిగే నిరసన కార్యక్రమానికి సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ హాజరవుతారన్నారు. ఈకార్యక్రమానికి పార్టీ శ్రేణులు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శులు ఎస్.మునెప్ప, ఎన్.లెనిన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గిడ్డయ్య

ఆదోని జిల్లాపై సందిగ్ధం..

- ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షి నాయుడుతో మంత్రి నిమ్మల భేటీ
- నేడు రెవెన్యూ మంత్రి అనగానితో సమావేశం
- నేడు ఆదోని బంద్‌కు పిలుపునిచ్చిన ప్రజాసంఘాలు

కర్నూలు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆదోని జిల్లా ఏర్పాటు గురించి మంగళవారం విజయవాడలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో జరిగిన జిల్లా నాయకుల భేటీ సమావేశం అసంపూర్తిగా ముగిసింది. ఆదోని జిల్లా ఏర్పాటుపై సందిగ్ధత కొనసాగుతోంది. జిల్లా ఏర్పాటు చేయాల్సిందే అంటూ ప్రజా సంఘాలు, రాజకీయ నాయకులు చేపట్టిన ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఆదోని జిల్లా సాధన అనే డిమాండ్ పశ్చిమ ప్రాంత ప్రజల సెంటిమెంటుగా మారింది. రిలే నిరాహారదీక్షలు, ధర్నాలు, రాస్తారోకోలు ర్యాలీలు వంటి నిరసనలతో ప్రజా ఆందోళనలు రోజురోజుకూ ఉధృతమవుతున్నాయి. ఈ నేపథ్యంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు సీఎం చంద్రబాబును కలిసి ప్రజల ఆకాంక్షను వివరించారు. ఇప్పటికే ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి ఆదోని జిల్లాతో పాటు నియోజకవర్గాన్ని నాలుగు మండలాలుగా విభజించాలని డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే. ప్రజా ఆందోళనల ఉధృతం నేపథ్యంలో సీఎం చంద్రబాబు స్థానిక నాయకులతో చర్చించాలంటూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి అయిన నిమ్మల రామానాయుడుకు సూచించారు. అందులో భాగంగానే మంగళవారం జిల్లా టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఆదోని ఎమ్మెల్యే డా. పార్థసారథి, టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడుతో ఇన్‌చార్జి మంత్రి అయిన జలవనరుల శాఖ మంత్రి నిమ్మల ఆదోని జిల్లా ఏర్పాటు పై సుదీర్ఘంగా చర్చించారు. ఏర్పాటు ఆవశ్యకత, వనరులు, స్థానిక పరిస్థితులు, నైసర్గిక స్వరూపం తదితర అంశాలను నిమ్మల అడిగి తెలుసుకున్నారు. అదే క్రమంలో ఎన్నికల ముందుగానీ, ఆ తర్వాత అంతకుముందు కూటమి ప్రభుత్వం గానీ, కూటమి పార్టీలు గానీ ఏమైనా హామీలు ఇచ్చాయా? అంటూ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి, ఇన్‌చార్జి మీనాక్షినాయుడు ఆదోని జిల్లా సాధన ఉద్యమం ఉధృతం అవుతున్న తీరు వివరించారు.


మాట్లాడుతున్న ఆదినారాయణరెడ్డి

మిగతా 6వ పేజీలో

శ్రీమఠం హుండీ ఆదాయం రూ.3.07 కోట్లు

మంత్రాలయం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠం హుండీ ఆదాయం రూ.3,06,81,661 నగదు వచ్చినట్లు ఏఏవో మాధవ శెట్టి మఠం మేనేజర్లు ఎస్‌కె శ్రీనివాస రావు, వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్ తెలిపారు. మంగళవారం గురు రాజ్యాంగ భవనంలో నవంబరు, డిసెంబరు నెలల్లోని 21 రోజుల హుండీ ఆదాయాన్ని దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్ల మధ్య లెక్కించారు. ఈ నగదుతో పాటు 23 గ్రాముల బంగారం, 490 గ్రాముల వెండి, వివిధ దేశాల విదేశీ కరెన్సీ వచ్చినట్లు తెలిపారు. నగదును శ్రీమఠం బ్యాంకు ఖాతాకు జమ చేశారు. ఈ లెక్కింపులో అనంతపురానిక్ జేపీ స్వామి, కృష్ణమూర్తి, సుజ్ఞానేంద్ర గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.


హుండీ లెక్కిస్తున్న భక్తులు



సైబర్ కేటుగాళ్లు రోజురోజుకూ కొత్త విధానాలతో రెచ్చిపోతున్నారు. కరెంటు అకౌంటు వివరాలు ఇస్తే కమీషన్ ఇస్తామని ఆశచూపి మోసాలు చేస్తున్నారు. వీరి మాయలో పడి వివరాలు ఇస్తే జైలుకు వెళ్లాల్సిందే. సైబర్ నేరాలపై పోలీసులు నిత్యం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ కేటుగాళ్లు ఏదో విధంగా అమాయకులను మభ్యపెట్టి మోసాలకు పాల్పడుతున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండటమే దీనికి పరిష్కారం.

ఖాతా వివరాలిస్తే కటకటాలే..

● కమీషన్ ఆశ చూపుతున్న సైబర్ నేరగాళ్లు ● గతంలో భారీగా లావాదేవీలు జరిపిన వారిపైనే గురి ● సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నంద్యాల టౌన్ డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): 'మీ బ్యాంకు ఖాతా వివరాలు ఇస్తే.. ఇందులో జమయ్యే డబ్బులకు మీకు కమీషన్ ఇస్తాను. నీపేరుతో కరెంటు ఖాతా ఓపెన్ చేసి వివరాలు ఇవ్వు నీకు ప్రతినెలా జీతంలా కొంత మొత్తం చెల్లిస్తాను' ఈమాటలు నమ్మి బ్యాంకు ఖాతా వివరాలు ఇచ్చావో ఎప్పుడో ఒకప్పుడు కటకటాలు లెక్కించాల్సిందే. సైబర్ నేరగాళ్లు అమాయకులకు కమీషన్ ఆశ చూపి వారి ఖాతాలను వాడుకుంటూ నేరాల ఉచ్చులోకి లాగుతున్నారు. ఇటీవల నంద్యాలలో కొన్ని కేసులు నమోదైనట్లు సైబర్ పోలీసులు తెలుపుతున్నారు.

ప్రస్తుతం స్తబ్దుగా ఉన్న..

గతంలో కరెంట్ బ్యాంకు ఖాతా ద్వారా భారీగా లావా దేవీలు జరిపి ప్రస్తుతం స్తబ్దుగా ఉంచిన వారి పైనే సైబర్ నేరగాళ్లు దృష్టి పెడుతున్నారు. మీ ఖాతాకు మా కంపెనీ నుంచి డబ్బు వస్తుందని, తమ సిబ్బంది ఖాతాల్లో జమ చేస్తే కమీషన్ ఇస్తామని నమ్మిస్తారు. ఇలా సైబర్ వలలో పడిన వారి నుంచి ఈ ఖాతాలకు జమ చేసుకుని అక్కడినుంచి ఈ వివిధ ఖాతాలకు బదిలీ చేస్తున్నారు. కమీషన్ వచ్చేస్తోంది అని మిన్నకుండిపోతే ఇబ్బందులు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

మ్యూల్ అకౌంట్

నేరస్థులు తమ డబ్బును అక్రమంగా దాచడానికి, తరలించడానికి ఉపయోగించే ఖాతాను మ్యూల్ అకౌంట్ అంటారు. మోసగాళ్లు వేరొకరి ఖాతాల్లోకి అక్రమంగా సొమ్ము మళ్లిస్తారు. ఖాతా ఇచ్చినందుకు కొంత మొత్తం కమీషన్‌గా వేస్తారు. ఇలా ఖాతాలు ఇచ్చి చాలా మంది మోసపోయారు. ఇలా నంద్యాలలో కేసులు నమోదు అయ్యాయి.

తప్పుడు పత్రాలు సమర్పించినా..

బ్యాంకులో ఒక అకౌంట్ తెరవాలంటే ఎంతో కష్టం. బ్యాంకు ఖాతా తెరిచే సమయంలో వ్యక్తి సిఫార్సు చేసే వ్యక్తి బ్యాంకుకు సరియైన పత్రాలతో వెళ్తే కానీ ఖాతా తెరవని బ్యాంకు ఉద్యోగులు. అలాంటిది చనిపోయిన వ్యక్తుల పేరుమీద, తప్పుడు పత్రాలు సమర్పించినా ఖాతా తెరుస్తున్నారనే ఆరోపణలున్నాయి. బ్యాంకు సిబ్బందిపై కూడా అనుమానం వస్తుందని సైబర్ పోలీసులు తెలిపారు.

ప్రజలకు అవగాహన..

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని పోలీసులు ప్రజలకు నిత్యం అవగాహన కల్పిస్తున్నారు. గ్రామాల్లో, ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో ఈ కార్యక్రమం కొనసాగుతూనే ఉంది. ఓటీపీలు షేర్ చేయవద్దు.. కొత్త వారికి బ్యాంకు ఖాతాల వివరాలు తెలపకండి అంటూ ఎన్నో జాగ్రత్తలు చెబుతున్నారు. అయినా సైబర్ నేరాలు పెరుగుతూనే ఉన్నాయి. ప్రజల్లో సైతం అవగాహన వస్తేనే ఇవి త గ్గుముఖం పట్టే అవకాశముంది.

నేరాల్లో చిక్కుకునే ప్రమాదం

జిల్లాలో ఇప్పటికే చాలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. అనవసరంగా డబ్బులు వస్తాయంటే నమ్మి మోసపోవద్దు. దీంతో నేరాల్లో చిక్కుకునే ప్రమాదముంది. వీటితో మీ ఖాతాల్లోని డబ్బులు పోతాయి. ఎవరు కూడా కమీషన్లు, ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా మోసపోవద్దు.
● గౌతమి, సీఐ, సైబర్‌క్రైం, నంద్యాల

జిల్లాలో జరిగిన కొన్ని సంఘటనలు..

- నంద్యాలలోని ఎస్బీఐ కాలనీకి చెందిన వ్యక్తిని కొందరు గుర్తు తెలియని వ్యక్తులు టెలిగ్రాం యాప్ ద్వారా 100మందిని యాడ్ చేసి ప్రతిరోజు డబ్బులు ఇన్వేస్ట్ చేస్తూ వెయ్యికి రూ.1300 ఇస్తామని చెప్పి నమ్మించి రూ.10వేల వరకు తిరిగి ఇస్తారు. వారి ట్రాప్‌లోకి వెళ్లిన తర్వాత డబ్బులు మన ఖాతాలో వస్తున్నట్లు చూపిస్తారు. ఆ డబ్బులను విత్‌డ్రా చేసుకునే అవకాశం లేకుండా చేస్తారు. ఇదిలా ఉంటే అందులో 98 మంది వారికి సంబంధించిన వారే ఉంటారు. కేవలం ఇద్దరు మాత్రమే వేరే వ్యక్తులు ఉంటారు. ఇలా మోసపోయి రూ.1 లక్ష పోగొట్టుకున్నారు.
- ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా వస్తువులు కొనుగోలు చేస్తే వారు మన వివరాలను హ్యాక్ చేసి మనకార్డులను, డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా కొనుగోలు చేస్తారు. వేరే రాష్ట్రాల నుంచి ఈ వ్యవహారం నడుస్తుండటంతో అక్కడే కేసు నమోదు చేస్తున్నారు. బాధితులు ఇక్కడి నుంచి వెళ్లలేకపోవడంతో వారి ఖాతాలను బ్యాంకువారు ఫ్రిజ్ చేస్తున్నారు. ఇలా పట్టణానికి చెందిన ఒక బ్యాంకు కోచింగ్ విద్యార్థి మోసపోయారు. ఫిర్యాదు చేయలేదు.
- నంద్యాల రైల్వేస్టేషన్ ప్రాంతానికి చెందిన ఒక ఆటో డ్రైవర్ ఆన్‌లైన్ యాప్ ద్వారా రూ. 10వేలు రుణం తీసుకున్నారు. ఈమొత్తాన్ని నెల వ్యవధిలో రూ.2500 అదనంగా చెల్లించా లని తెలిపారు. ఖాతాలో సరిపడ మొత్తాన్ని వేసి ఉంచాడు. కానీ యాప్‌కు సంబంధించిన వారు కాకుండా సైబర్‌గాళ్లు మొత్తాన్ని కొట్టేశారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సైబర్ పోలీసులు (ఫైల్)

ఈ ఏడాది కేసుల వివరాలు..

సైబర్ కేసులు	: 25
నష్టపోయిన నగదు	: రూ.12.7కోట్లు
ఫ్రిజ్ చేసిన మొత్తం	: రూ.3 కోట్లు
అవగాహన కార్యక్రమాలు	: 700

దైవమార్గంలో నడవాలి

● ఘనంగా 133 ఏళ్ల చర్చి వార్షికోత్సవం



మాట్లాడుతున్న నంద్యాల బిషప్ సంతోష్ ప్రసన్నరావు

చాగలమర్రి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు దైవమార్గంలో నడవాలని, ప్రేమ, కరుణ, దయ కలిగి ఉండాలని నంద్యాల జిల్లా బిషప్ రైట్‌రెవ సంతోష్‌ప్రసన్నరావు అన్నారు. మంగళవారం మండలంలోని ముత్యాలపాడు గ్రామంలో 133 ఏళ్ల చరిత్ర కలిగిన చర్చి వార్షికోత్సవంలో పాల్గొన్నారు. చర్చిలో క్యాండిల్‌లైట్ ఆరాధన, ఆలయ ప్రతిష్ట ప్రదక్షిణ కార్యక్రమాలు నిర్వహించారు. చర్చి విశిష్టత గురించి తెలియజేశారు. ఏసు చూపిన మార్గం అనుసరణీయమన్నారు. శాంతియుత జీవనం అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం బిషప్ సంతోష్‌ప్రసన్నరావు, దాసరి బూల సంతోష్ దంపతులను డీనరి చైర్మన్ ఫాదర్ చంద్రశేఖర్ సన్మానించారు. చర్చి వ్యవస్థాపకులు రెవ. రిచర్డ్ డెండిషఫర్డ్ సమాధి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బైబిల్, వాలీబాల్, సెటిల్, బ్యాట్మింటన్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఆళ్లగడ్డ, చాగలమర్రి డీనరి చైర్మన్లు ప్రసన్నకుమార్, చంద్రశేఖర్‌లు నగదు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైస్ ప్రెసిడెంట్ రాజేంద్ర, ట్రెజరర్ నందం ఐజాక్, స్టీఫెన్, ఫాదర్లు విక్టర్, బెంజిమెన్, రవికుమార్, అనిల్, సువార్తయ్య, సురేష్, సంపత్, సంఘ పెద్దలు, ఆయా చర్చిల ఫాదర్లు, సంఘ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ల్యాక్రోస్ పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ

● అభినందించిన గ్రామస్థులు



జాతీయ స్థాయి క్రీడల్లో నాలుగో స్థానం సాధించిన ఏపీ రాష్ట్ర జట్టు

కోసిగి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5నుంచి 7వ తేదీ వరకు జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఫెడరేషన్ కప్ ల్యాక్రోస్ పోటీల్లో కోసిగి మండల క్రీడాకారులు ప్రతిభ చాటారు. ఏపీ రాష్ట్ర జట్టు వరుసగా నాల్గవసారి మూడో స్థానం సాధించింది. ఈ జట్టుకు మండలంలోని డి.బెళగల్ గ్రామానికి చెందిన హుసేన్ సాబ్ కెప్టెన్‌గా వ్యవహరించారు. అదే గ్రామానికి చెందిన క్రీడాకారులు శివాజీ, గోవిందు పాల్గొన్నారు. డి.బెళగల్ గ్రామం నుంచి ముగ్గురు క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించడంపై మండల ప్రజలు, గ్రామస్థులు అభినందించారు.

డిగ్రీలో ఒకరు డీబార్

కర్నూలు అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ(ఆర్‌యూ) పరిధిలో మంగళవారం డిగ్రీ 5వ సెమిస్టర్ పరీక్షకు 89 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. 221 మంద దరఖాస్తు చేసుకోగా 197 మంది పరీక్షలు రాశారు. ఒకరు మాల్ ప్రాక్టిస్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించి డీబారు చేశామని పరీక్షల విభాగం అధికారి డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

13న నవోదయ ప్రవేశ పరీక్ష

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బనవాసి జవహర్ నవోదయ విద్యాలయంలో ఈనెల 13న 6వ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మావతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 80సీట్లకు 6,469 మంది విద్యార్థులు పోటీ పడనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలో 24 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారని, 13వ తేదీ ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు పరీక్ష ఉంటుందన్నాని వివరించారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ అడ్మిట్‌కార్డును పొందవచ్చని సూచించారు.

ప్రసూతి మరణాలను పూర్తిగా తగ్గించాలి : కలెక్టర్ సిరి

కర్నూలు కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రసూతి మరణాలను పూర్తిగా తగ్గించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సిరి వైద్య అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం కలెక్టర్ చాంబర్‌లో వైద్యశాఖకు సంబంధించిన కీ-పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ (కీలక పనితీరు సూచికలు)పై వైద్యాధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యశాఖకు సంబంధించిన కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ అమలులో వంద శాతం పురోగతి సాధించాలన్నారు..ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డు నమోదు పురోగతి తీసుకుని రావాలని డీసీహెచ్‌ఎస్‌ను ఆదేశించారు. సీపీవో భారతి, డీఎంహెచ్‌వో డా.భాస్కర్‌రాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్ చలానాలపై లోక్ అదాలత్

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలా వెంకట శేషాద్రి



మాట్లాడుతున్న బి. లీలా వెంకట శేషాద్రి

కర్నూలు లీగల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ట్రాఫిక్ రూల్స్ ఉల్లంఘించిన వారిపై ఉన్న పెండింగ్ ట్రాఫిక్ చలానాలను జాతీయ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకట శేషాద్రి తెలిపారు. ఈ నెల 13వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌పై మున్సిపల్ కోర్టు హాలులో జరిగిన ఓ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు ఈ పెండింగ్ చలానాలను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని ఆయన తెలిపారు. ఈ తీరుప మేరకు కక్షిదారులు, పోలీసులు సమన్వయంతో జాతీయ లోక్ అదాలత్‌ను ఆశ్రయించాలని ఆయన కోరారు. ఈ కేసుల పరిష్కారానికి ఎటువంటి ఖర్చు లేకుండా సత్వరంగా న్యాయాన్ని పొందవచ్చని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి రాజేంద్ర ప్రసాద్, జూనియర్ సివిల్ జడ్జీలు అనిల్ కుమార్, అనూష, అపర్ణ, పట్టణ డీఎస్పీ బాబు ప్రసాద్, ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

ఆదోని జిల్లాపై సందిగ్ధం..

5వ పేజీ తరువాయి

రెవెన్యూ మంత్రి అనగానితో మరో భేటీ:

ఆదోని జిల్లా ఏర్పాటుపై మంత్రివర్గ ఉప సంఘం కన్వీనర్, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌తో బుధవారం మరోసారి జిల్లా నాయకులు భేటీ కానున్నారు. ఈ భేటీలో ఇన్‌చార్జి మంత్రి నిమ్మల, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, ఎమ్మెల్యే పార్థసారథి, టీడీపీ ఇన్‌చార్జి మీనాక్షినాయుడుతో పాటు ఎమ్మిగనూరు, పత్తికొండ ఎమ్మెల్యేలు కూడా హాజరయ్యే అవకాశం ఉంది. సుదీర్ఘ చర్చల అనంతరం తుది నివేదికను సీఎం చంద్రబాబుకు అందజేస్తారు. జిల్లా ఏర్పాటుపై సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. అయితే.. జనవరి 1వ తేదీ నుంచి జనగణన చేపట్టనుండటంతో ఆదోని జిల్లా ఏర్పాటు సాధ్యమా.. ప్రభుత్వం సానుకూలమైన నిర్ణయం తీసుకుంటుందాని పలువురు చర్చిస్తున్నారు.

శాస్త్రీయంగా మండల విభజన చేయాలి : ఆదినారాయణరెడ్డి

ఏ గ్రామ ప్రజలకూ ఇబ్బంది లేకుండా ఆదోని మండలాన్ని విభజన చేయాలని పెద్దహరివాణం మండల సాధన సమితి కన్వీనర్ ఆదినారాయణరెడ్డి కోరారు. మంగళవారం కర్నూలులోని ప్రజా వైద్యశాల సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదోని మండలంలోని ఆరు గ్రామాలు, హొళగుంద మండలంలోని 6 గ్రామాలు, కౌతాళం మండలంలోని ఒక గ్రామం కలిపి 13 గ్రామాలతో మండలం ఏర్పాటు చేయాలని తాము మొదటి నుంచి డిమాండ్ చేశామని తెలిపారు. ప్రభుత్వం ఆదోని మండలంలోని 17 గ్రామాలతో పెద్దహరివాణం మండలం ఏర్పాటుకు గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిందని, మిగిలిన 16 గ్రామాలు దీనిని వ్యతిరేకిస్తున్నట్లు ప్రజల్లో గందరగోళం సృష్టించడం సరైంది కాదన్నారు. రాష్ట్రంలోనే అతి పెద్ద మండలమైన ఆదోని మండలాన్ని ఏ ఒక్కరికి ఇబ్బంది లేకుండా విభజన చేయాలని, సుదూర గ్రామాలను సమీప మండలంలోనే ఉంచాలని కోరారు. ప్రభుత్వం 13 గ్రామాలతో పెద్దహరివాణం మండలం ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని, అదే క్రమంలో ప్రజా ఆకాంక్షను అర్థం చేసుకుని ఆదోని జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు ఆదోని బంద్

ఆదోని, ఎమ్మిగనూరు, ఆలూరు, మంత్రాలయం, పత్తికొండ నియోజకవర్గాలను కలుపుతూ ఆదోనిని నూతన జిల్లాగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ రోజురోజుకూ బలపడుతోంది. వివిధ రూపాల్లో ఆందోళనలు కొనసాగిస్తున్నారు. అందులో భాగంగానే ఆదోని జిల్లా సాధన సమితి, జేఏసీ ఆధ్వర్యంలో ఆదోని బంద్‌కు పిలుపునిచ్చారు. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య దుకాణాలు బంద్ చేయనున్నారు. వ్యాపారులు, ప్రజలు స్వచ్ఛంద బంద్‌కు ముందుకు వచ్చినట్లు తెలుస్తుంది.



ఆదోని: ధర్నా చేస్తున్న నాయీబ్రాహ్మణులు, కాంగ్రెస్ నాయకులు

ఈ సమావేశంలో విద్యావంతుల వేదిక రాష్ట్ర కన్వీనర్ అరుణ్, రైతు కూలీ సంఘం నాయకులు సుంకన్న తదితరులు మాట్లాడుతూ ఆదోని జిల్లా ఏర్పాటు కోసం ప్రజలు మరింతగా పోరాడాలని వారు తెలిపారు.



నైపుణ్యాలను వెలికితీసేదే బాలోత్సవం

అట్టహాసంగా ప్రారంభం



మాట్లాడుతున్న రవీంద్ర విద్యాసంస్థల వ్యవస్థాపకుడు జి. పుల్లయ్య

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో నైపుణ్యాలను వెలికితీసేదే బాలోత్సవమేనని పలువురు వక్తలు పేర్కొన్నారు. కర్నూలు నగర శివారులోని మాంటిస్సోరి ఇండస్ పాఠశాలలో 5వ కర్నూలు బాలోత్సవం మంగళవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ముందుగా బాలోత్సవ కార్యక్రమం జెండాను బాలోత్సవ గౌరవాధ్యక్షుడు జి.పుల్లయ్య ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ నైపుణ్యాలను పెంచుకోవడానికి ఈ బాలోత్సవాలు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి.శంకర్‌శర్మ మాట్లాడుతూ సెల్‌ఫోన్ భూతానికి పిల్లలు బలైపోతున్నారన్నారు. మాంటిస్సోరి ఇండస్ పాఠశాల ప్రిన్సిపాల్ మీనాక్షి మాట్లాడుతూ బాలోత్సవం ఎంతో ఉత్సాహాన్ని కలిగిస్తాయన్నారు. బాలోత్సవం ప్రధాన కార్యదర్శి డి., దనుంజయ, డా.మురళీధర్, డా.మధుసూదన్, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ కుమార్, క్లస్టర్ యూనివర్సిటీ డీన్ డా.అక్తర్ భాను, ప్రైవేటు విద్యాసంస్థల గౌరవాధ్యక్షుడు పీబీవీ సుబ్బయ్య, ప్రైవేటు విద్యాసంస్థల జిల్లా అధ్యక్షుడు వాసుదేవయ్య, శ్రీలక్ష్మి స్కూల్ డైరెక్టర్ దీక్షిత్ పాల్గొన్నారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, కథా, కవితా రచన పోటీలు నిర్వహించారు. వివిధ పోటీల్లో విద్యార్థుల ప్రదర్శనలు అలరించాయి.

సమస్యల వలయంలో జీజీహెచ్

● స్థాయి పెంచారు.. వసతులు మరిచారు
● భర్తీకాని పోస్టులు
● అవస్థలు పడుతున్న రోగులు



నంద్యాల హాస్పిటల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నంద్యాల సర్వజన వైద్యశాల (జీజీహెచ్) సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. కొన్నేళ్ల నుంచి సమస్యలు పరిష్కారం కాక రోగులు అవస్థలు పడుతున్నారు. నంద్యాల జిల్లా కేంద్రమైన తర్వాత ప్రభుత్వ ఆస్పత్రి నుంచి జీజీహెచ్‌గా స్థాయి పెంచారేకాని తగ్గట్టుగా వసతులు చేకూర్చక పోవడంతో రోగులు ఇబ్బందులకు గురిఅవుతున్నారు. జీజీహెచ్‌లో పోస్టులు భర్తీచేయాలంటే కర్నూలు నుంచి అనుమతి రావాల్సి ఉంది. 2022లో జీజీహెచ్‌గా స్థాయి పెంచినప్పటి నుంచి సిబ్బంది లేకపోవడంతో ఇబ్బందిగా మారింది.

సౌండ్ ప్రూఫ్ గదిని త్వరలోనే ప్రారంభిస్తాం



జీజీహెచ్‌లో ఓపీడీ విభాగంలో సౌండ్ ప్రూఫ్ గది సిద్ధంగా ఉంది. త్వరలోనే వినికిడి పరీక్షాయంత్రం (బేరా)ను ఏర్పాటుచేసి రోగులకు అందుబాటులోకి తెస్తాం. ఫిజియోథెరఫి భవనానికి జనరేటర్ కనెక్షన్‌ను త్వరలో ఏర్పాటుచేస్తాం. పోస్టుల భర్తీకోసం ప్రతిపాదనలు పంపాం. - డా. మల్లేశ్వరి, సూపరింటెండెంట్, జీజీహెచ్

650 పడకలకు పెంచేందుకు..

ప్రస్తుతం 450పడకలున్న జీజీహెచ్ త్వరలో 650పడకలకు పెంచేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. స్థాయికి తగ్గట్టుగా ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌ను, జూనియర్ అసిస్టెంట్, కంప్యూటర్ అసిస్టెంట్, ఆఫీస్ సబార్డినేట్ పోస్టులు నేటికీ ఖాళీగానే ఉన్నాయి. ఫిజియోథెరఫీ భవనానికి జనరేటర్ లేకపోవడంతో విద్యుత్ లేని సమయాల్లో అంధకారం నెలకొంటోంది. పక్కనే జనరేటర్ ఉన్నా కొన్ని నెలలనుంచి దాని వైర్ తెగి పోవడంతో ఇంతవరకు మరమ్మతులు చేపట్టే నాథుడేలేడు. జీజీహెచ్‌లో జనరల్ డ్యూటీ అటెండెంట్ (జీడీఏలు)77పోస్టులు మంజూరుకాగా ప్రస్తుతం 40లోపే ఉన్నారు.

రూ.లక్షల విలువ చేసే పరికరాలున్నా..

రక్తనిధి కేంద్రానికి లక్షలు విలువచేసే పరికరాలున్నా నిరుపయోగమే. కేవలం కాంపొనెంట్ మిషన్ లేకపోవడంతో దాదాపు 10మిషన్లు నిరుపయోగంగా ఉన్నాయి. ఓపీ విభాగంలో అధికసంఖ్యలో రోగులు వస్తున్నా సరైన సిబ్బందిలేక ఓపీ కోసం గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి. కార్డియాల జిస్టు లేకపోవడంతో హృద్రోగులకు తిప్పలు తప్పడంలేదు. అత్యవసర సమయంలో హృద్రోగులు ప్రాణాలు కోల్పోవాల్సిన పరిస్థితి నెలకొంది. కర్నూలు లేదా ప్రైవేట్ ఆస్పత్రుకు వెళ్లాలని సూచిస్తున్నారు. గత కొన్నేళ్లనుంచి వినికిడి పరీక్షాయంత్రం స్టోర్‌రూమ్‌లోనే పదిలంగా ఉంది. సౌండ్ ప్రూఫ్ గదిలేకపోవడంతో ఈ యంత్రం పక్కనబెట్టారు. ఈ యంత్రం విలువ దాదాపు రూ.5లక్షలుంటుంది. జిల్లా కేంద్రం కావడంతో జీజీహెచ్‌కు దాదాపు 1500మంది రోగులు నిత్యం చికిత్స కోసం వస్తున్నారు. రోగులకు అవసరమైన వసతులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.



ఉపయోగంలో లేని మిషన్లు

సతీష్ కుటుంబానికి న్యాయం చేయాలి

- సీఎంను కలిసిన తుగ్గలి నాగేంద్ర



చంద్రబాబుతో తుగ్గలి నాగేంద్ర దంపతులు

తుగ్గలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హత్యకు గురైన సీఐ సతీష్ కుటుం బానికి న్యాయం చేయాలని, ప్రభుత్వం అండగా నిలవాలని రాష్ట్ర శాలి వాహన సంక్షేమ సంఘం అధ్యక్షుడు తుగ్గలి నాగేంద్ర, మాజీ జడ్పీటీసీ సభ్యురాలు వరలక్ష్మి అన్నారు. సోమవారం సీఎం కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలిసి పత్తికొండ చెందిన సీఐ సతీష్ మరణం వెనకాల ఎవరూన్నా వదిలిపెట్టవద్దని, అతని మరణానికి కారకులైన వారిని శిక్షించాలని విన్నవించారు. ఇందుకు స్పందించిన సీఎం చంద్రబాబు సతీష్ మరణం వెనకాల ఎవరున్నా వారిపై చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశిస్తామని, మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారన్నారు.

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

సంజామల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): భర్త కనిపించకుండా పోయాడని భార్య ఫిర్యాదు చేసింది. ఈ సంఘటనమంగళవారం జరిగింది. నొస్సం గ్రామానికి చెందిన మేరీతో 2016లో కోవెలకుంట్ల మండలం కంపమళ్ల గ్రామానికి చెందిన శ్రీరాముల మధుకుమార్‌కు పెళ్లయింది. మధు కుమార్ ఆటో నడిపేవాడు. మేరీ కూలీ పనులకు వెళ్లేది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు. మధు కుమార్ మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకుని కూతురును, తనను పట్టించుకోకుండా తిరుగుతుండటంతో గత ఏడాదిగా మేరీ నొస్సం గ్రామంలోని తన తల్లి దగ్గర ఉంటోంది. గత కొద్ది కాలంగా అతని ఆచూకీ లేదని కంపమళ్లలో సమీప బంధువుల ద్వారా తెలుసుకొని మేరీ ఫిర్యాదు చేసినట్లు కేసు దర్యాప్తు చేస్తున్నటు ఎస్.ఐ రమణయ్య తెలిపారు.



మధుకుమార్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

డోన్ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజోతి): మండలంలోని కొత్తపల్లె గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడని డోన్ పట్టణ పోలీసులు తెలిపారు. మృతుడి వయస్సు 35 నుంచి 40ఏళ్లలోపు ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

వెలుగోడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వెలుగోడు, బోయరేవుల గ్రామాల మధ్య ప్రవహించే గాలేరు నదిలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సమాచారం అందుకున్న బోయరేవుల వీఆర్వో మాబాష పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి ఎస్ఐ సురేశ్ సిబ్బందితో చేరుకొని, మృతదేహాన్ని బయటకుతీశారు. శవపరీక్ష నిమిత్తం ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడిది ప్రకాశం జిల్లా పాలమూరు గ్రామం అని తెలిసింది. ఈ ప్రాంతానికి ఎలా వచ్చాడు? ఎలా చనిపోయాడు? అనేది తేలాల్సిఉంది.

బైకు దొంగ అరెస్టు

- 42 ద్విచక్ర వాహనాలు రికవరీ

కర్నూలు క్రైం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మూడో పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలో బైకు దొంగను అరెస్టు చేసినట్లు డీఎస్పీ బాబు ప్రసాద్ తెలిపారు. మంగళవారం త్రీటౌన్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. పదిరోజుల క్రితం ప్రభుత్వ ఆసుపత్రిలో బైక్ కనబడకుండా పోవడంతో బాధితుడు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు దర్యాప్తు చేయగా, హడావుడిగా వున్న వ్యక్తుల వాహనాలను అనంతపురం జిల్లా కక్కపల్లికి చెందిన పోతుల జాన్(29) దొంగిలిస్తున్నట్లు గుర్తించారు. నిందితున్ని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలిచారు. 42 బైక్‌లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. త్రీటౌన్ సీఐ శేషయ్య, ఎస్ఐ ఆశాలత, ఏఎస్ఐ గిడ్డయ్య, హెడ్ కానిస్టేబుల్ వాసు, రంగారావు, కానిస్టేబుల్స్ శేఖర్, నాగరాజు, కిషోర్ ఉన్నారు.

చీటింగ్ కేసు నమోదు

కర్నూలు క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సత్య మొబైల్స్ దుకాణంలో రూ.21 లక్షల మేర మోసం జరిగినట్లు కంపెనీ ఆడిటర్ రాము పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల మేరకు.. షోరూం మేనేజర్ రాఘవేంద్ర అసిస్టెంట్ మేనేజర్ తులసిరామ్ నాయక్ కంపెనీకి చెందిన వివిధ రకాల వస్తువుల బిల్లులు లేకుండా విక్రయించినట్లు ఆడిట్‌లో గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీ నాయకుడిపై ఎస్సీ, ఎస్టీ కేసు

కర్నూలు క్రైం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకుడు తిమ్మారెడ్డిపై రెండో పట్టణ పోలీసులు ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశారు. వివరాల మేరకు.. బుధవారపేట చెందిన చంద్రశేఖర్, శ్రీకాంత్ సంకల్‌బాగ్‌లో ఉన్న తమ మిత్రుడు రవిని కలిసేందుకు ఈ నెల 4న వెళ్లారు. అదే ప్రాంతానికి చెందిన వైసీపీ నాయకుడు తిమ్మారెడ్డి వీరిని చూసి బైక్‌తో ఢీకొట్టాడు. ప్రభుత్వం వచ్చాక టీడీపీలోకి వెళ్తారా.. అంటూ దాడి చేశాడు. బాధితులు ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని మంగళవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదనపు కట్నం వేధింపుల కేసు..

కొలిమిగుండ్ల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోరుమానుపల్లె గ్రామానికి చెందిన షేక్ షభాన బేగం తనను భర్త, కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు. భర్త మస్తాన్‌వలి, అత్త, మామలు తనను మానసికంగా, శారీరకంగా ఇబ్బందులకు గురి చేస్తూ, అదనపు కట్నం కోసం వేధిస్తున్నారని ఆమె ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు.

హామీలను తుంగలో తొక్కిన ప్రభుత్వం

- మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని

కల్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యువతకిచ్చిన నిరుద్యోగ భృతి, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలను కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందని మాజీ ఎమ్మెల్యే, నంద్యాల వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం నగర శివార్లలోని హ్యాంగౌట్ ఫంక్షన్ హాల్లో వైసీపీ నాయకుడు కాటసాని శివ నరసింహారెడ్డి అధ్యక్షతన చేపట్టిన యువతా మేలుకో కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నికల్లో యువతకు అలవికాని హామీలిచ్చిన కూటమి అధికారంలోకి రాగానే వారిని దారుణంగా మోసం చేస్తుందని ఆరోపించారు. కాటసాని శివ నరసింహారెడ్డి మాట్లాడుతూ యువత మేలుకోవాలని, మోసాలపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ఆయన విమర్శించారు. మేయర్ బివై.రామయ్య, డిప్యూటీ మేయర్ సిద్దారెడ్డి రేణుక, కార్పొరేటర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెగులు.. దిగులు

- తగ్గిన జాజి, మల్లెపూల దిగుబడి
- ఆందోళనలో రైతులు



చాగలమర్రిలో తెగుళ్లతో ఎండిన మల్లె తోట

చాగలమర్రి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పూల తోటలు సాగు చేసిన రైతులకు అడుగడుగునా అవాంతరాలు తప్పడం లేదు. ఓ వైపు తెగుళ్ల బెడద, మరో వైపు తుఫాన్ వర్షాలతో పూల రైతులు అవస్థలు పడుతున్నారు. చాగలమర్రి మండలంలో పూల సాగుకు పెట్టింది పేరు. 1,000 ఎకరాల్లో మల్లెపూల తోటలు, 600 ఎకరాల్లో సన్నజాజి పూల తోటలు సాగు చేశారు. వీటిని పలు మార్కెట్‌లకు విక్రయిస్తారు. ఇక్కడి నుంచి హైదరాబాదు, కర్నూలు, తిరుపతికి తరలిస్తారు. అధిక విస్తీర్ణంలో ఆయా గ్రామాల్లో మల్లె తోటలు సాగు చేశారు. పూల సాగు చేసే రైతులు ఎక్కువగా పండుగల సమయంలో లాభాలు గడిస్తారు. ఈ ఏడాది భారీ వర్షాల వల్ల మల్లెపూలు, జాజిపూల దిగుబడి భారీగా తగ్గింది ఎకరాకు 2 కేజీలు కూడా రావడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. అధిక వర్షాలు, తెగుళ్ల వల్ల చెట్లు దెబ్బతిని నష్టం వాటిల్లింది. ఉద్యాన పంటలకు అందించే రాయితీ కూడా రావడం లేదని, తోటల వైపు సంబంధిత అధికారులు కన్నెత్తి చూడటం లేదని, తెగుళ్ల నివారణకు సలహాలు ఇవ్వడం లేదని రైతులు వాపోతున్నారు.

తెల్లదోమ, ఎర్రదోమ తెగుళ్ల ప్రభావం

ప్రస్తుతం తోటల్లో తెల్లదోమ, ఎర్రదోమ లాంటి తెగుళ్ల ఆశిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. తెగుళ్లతో మల్లె తోటల్లో ఎర్రమొగ్గ ఏర్పడి దిగుబడిపై ప్రభావం చూపుతోంది. వీటి నివారణకు పలుమార్లు మందులు పిచికారీ చేస్తున్నా నియంత్రణ కావడం లేదని రైతులు దిగాలు చెందుతున్నారు.

పంట దిగుబడి చేతికి అందాలంటే 6 విడతలుగా పిచికారీ చేయాల్సి వస్తుందన్నారు. వీటికి రూ.20 వేలు దాకా ఖర్చు వస్తుందని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అందిన పూల దిగుబడి మార్కెట్‌లో విక్రయాలతో సరి చూసుకుంటే లాభాలు ఆశాజనకంగా లేవని పూల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలల క్రితం సీజన్ బట్టి మల్లె పూల ధర కిలో రూ.170, జాజిపూలు కిలో రూ.150 పలికాయి. నెలన్నర వ్యవధిలోనే కిలో మల్లెలు రూ.300 వరకు చేరి ఆ తర్వాత రూ.120 ధర పడిపోయింది. ప్రస్తుతం మల్లె పూలు, జాజిపూలు దిగుబడి భారీగా తగ్గింది. ఎకరాకు 2 కేజీలు మాత్రమే దిగుబడి వస్తోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. పూలను కోసే కూలీలకు కూలీకి ఇవ్వలేక అవస్థలు పడుతున్నారు. దిగుబడి తక్కువగా ఉండటంతో కేజీ ధర రూ.800 నుంచి రూ.1,000 పలుకుతోంది. ధర ఉన్నా దిగుబడి లేక కూలీ డబ్బులు వచ్చే పరిస్థితి లేదని రైతులు విలపిస్తున్నారు. కూలీలకు కూలీ ఇవ్వలేక కొందరు తోటలను ప్రత్యామ్నాయ పంటలు వేసేందుకు దున్నేస్తున్నారు. మరి కొందరు గొర్రెలకు మేతగా విడిచి పెట్టారు. ఈ ఏడాది దిగుబడి లేక రైతులు నష్టాలపాలవు తున్నారు. ప్రభుత్వం మల్లెతోటలకు రాయితీలు కల్పించి ఆదుకోవాలని కౌలు రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



నాలుగెకరాల్లో మల్లెలు, జాజులు సాగుచేశా. గుత్త ఎకరాకు రూ.లక్ష. గత నెలలో కేజీ పూలు రూ.170 ధర పలికింది. ప్రస్తుతం దిగుబడి లేక నష్టపోతున్నాం. ఎకరాకు కేజీ పూలు మాత్రమే దిగుబడి వస్తోంది. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలి.

● షబ్బీర్, రైతు, చాగలమర్రి

దిగుబడి రాక నష్టపోతున్నాం



3 ఎకరాల్లో జాజి, మల్లెపూలు సాగు చేశా. కౌలు రూ.3.50 లక్షలు. భారీ వర్షాలు తెగుళ్ల వల్ల దిగుబడి రాక నష్టపోతున్నాం. కూలీలకు కూడా రావడం లేదు. వర్షాల వల్ల దెబ్బతిన్న తోటలకు పరిహారం అందలేదు. తెగుళ్ల నివారణకు సలహాలు, సూచనలు లేవు. పరిహారం అందించి ఆదుకోవాలి.

● ఉసేన్‌బాషా, కౌలురైతు, చాగలమర్రి



జాజిపూలు కోస్తున్న కూలీలు

ఆత్మకూరులో డీజిల్ దొంగలు

- లారీ యజమానుల గగ్గోలు

ఆత్మకూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో డీజల్ దొంగలు రెచ్చిపోతున్నారు. పార్కింగ్ చేసిన లారీలను లక్ష్యంగా చేసుకుని డీజల్‌ను దొంగలిస్తున్నారు. దీంతో బాధిత లారీల యజమానులు లబోదిబోమంటున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూరు పట్టణంలో పార్కింగ్ చేసిన లారీల్లోని డీజల్ ట్యాంకుకు అమర్చి ఉన్న తాళాన్ని ధ్వంసం చేసి దర్జాగా డీజల్‌ను తస్కరించారు. ప్రత్యేకించి మైనార్టీ కాలనీ, ఇస్లాంపేట, రైస్‌మిల్, నంద్యాల టర్నింగ్ తదితర ప్రాంతాల్లో పార్కింగ్ చేసి ఉంచిన 9 లారీల్లో 1,500 లీటర్ల డీజల్‌ను కొందరు దుండగులు సోమవారం రాత్రి ఎత్తుకెళ్లారు. మంగళవారం విషయం తెలుసుకున్న లారీల యజమానులు ఆత్మకూరు అర్బన్ సీఐ రాముకు ఫిర్యాదు చేశారు. బాధితులను అడిగి వివరాలు సేకరించిన పోలీసులు నిందితుల కోసం సీసీ కెమెరాల్లో పరిశీలిస్తున్నారు. ఏ చిన్న ఆధారం లభించినా డీజల్ దొంగలను వదిలే ప్రసక్తే లేదని పోలీసులు వారికి భరోసా ఇచ్చారు. ఇదిలావుంటే ఇంతకాలం ఇళ్ల బయట పార్కింగ్ చేసిన బైకుల్లో నుంచి గుర్తు తెలియని దుండగులు రాత్రివేళల్లో పెట్రోల్‌ను ఎత్తుకెళ్లేవారు. అయితే ప్రస్తుతం లారీల్లో నుంచే డీజల్‌ను దొంగలిస్తుండటంతో లారీ యజమానులు ఆందోళన చెందుతున్నారు.



అర్బన్ సీఐ రాముకు ఫిర్యాదు చేస్తున్న యజమానులు

పిల్లిగుండ్లలో డెంగీ

గోనెగండ్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిల్లిగుండ్ల గ్రామంలో 20 ఏళ్ల వ్యక్తికి మంగళవారం డెంగీ సోకినట్లు జిల్లా మలేరియా అధికారి నూకరాజు తెలిపారు. పిల్లిగుండ్ల గ్రామానికి చెందిన వ్యక్తికి వారం రోజులుగా జ్వరం ఉండటంతో స్థానిక వైద్యుల దగ్గర చికిత్స చేయించుకున్నారు. అయినప్పటికీ జ్వరం తగ్గక పోవడంతో కర్నూలు ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ డెంగీ వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయింది. దీంతో మంగళ వారం పిల్లిగుండ్లకు జిల్లా మలేరియా అధికారి నూకరాజు, సబ్ యూనిట్ ఆఫీసర్ కృష్ణుడు, గ్రామాన్ని చేరుకొని గ్రామంలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వ్యాధిగ్రస్తుని ఇంటి పరిసరాలలో దోమల నివారణ మందును పిచికారి చేయించారు.

ఇన్ గేట్‌లో కష్టమే

- 108 అంబులెన్స్‌కు దారి ఇవ్వని ఆటోలు
- పత్తాలేని ట్రాఫిక్ పోలీసులు, సెక్యూరిటీ



దారిలేక ఆగిపోయిన అంబులెన్స్

కర్నూలు హస్పిటల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జీజీహెచ్‌లోనికి వచ్చే రోగులు ఆటోలతో ఇబ్బందిపడుతున్నారు. ఇన్ గేట్ వద్ద నిత్యం ఇష్టారాజ్యంగా ఆటో డ్రైవర్లు, పండ్ల వ్యాపారులు ఆక్రమించి ఉంటాయి. దీంతో రోగులు లోనికి వెళ్లాలంటే చాలాసేపు నిలిచి ఉండాల్సి వస్తున్నది. ఆసుపత్రిలోనికి అంబులెన్స్ వెళ్లాలన్నా అష్టకష్టాలు పడాల్సి వస్తున్నది. మంగళవారం ఉదయం కర్నూలు జీజీహెచ్ ఇన్ గేట్‌లోనికి ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ రోగితో 108 అంబులెన్స్ లోపలికి వెళ్లడానికి వచ్చింది. ఆ సమయంలో ఆటోలు, పండ్ల వ్యాపారులు అడ్డంగా ఆక్రమించుకోవడంతో అంబులెన్స్ లోపలికి వెళ్లలేకపోయింది. ఇన్‌గేటు వద్ద రెండు గేట్లలో ఒకటి మూసి, మరొకటి తెరిచి ఉంచడంతో ఇరుకుగా మారి లోపలికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు, ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది ఇన్‌గేటు ముందు ఒక్కరూ లేరు. ట్రాఫిక్ పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది పట్టించుకోకపోవడంతో అంబులెన్స్ రావడానికి చాలా సమయం పట్టింది. రోగి బంధువులు వాగ్వాదానికి దిగారు. ట్రాఫిక్ అధికారులు ఇన్‌గేటు వద్ద ఉన్న రెండు గేట్లను తెరిచి ఉంచి ట్రాఫిక్‌ను, ఆటోలను నియంత్రించాలని రోగులు కోరుతున్నారు.



మెయిన్ గేటుకు అడ్డంగా నిలిపిన ఆటోలు

నేడు డిప్యూటీ సీఎం మాటామంతి

- జడ్పీ అధికారులు, ఉద్యోగులతో వీడియో కాన్ఫరెన్స్



కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జడ్పీ సీఈవో, అధికారులు ఉద్యోగులతో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ 'మాటామంతి' బుధవారం నిర్వహించనున్నారు. ఈ మేరకు విజయవాడ నుంచి అధికారులకు సమాచారం అందించింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇటీవల వివిధ కేటగిరీలలో పదోన్నతి పొందిన అధికారులు, సిబ్బందితో ఆయన నేరుగా మాట్లాడనున్నారు. ఈ మేరకు సుమారు 17 మంది ఉద్యోగులు ఉమ్మడి జిల్లా నుంచి మాట్లాడేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పరిషత్‌లో నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో నాసరరెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో గుడిసె దగ్ధం

- పత్తి, ఆముదాలు, నగదు అగ్గిపాలు
- రూ. 5లక్షల ఆస్తి నష్టం



కాలిపోయిన గుడిసెను పరిశీలిస్తున్న వీఆర్వో

గోనెగండ్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రబాడు గ్రామంలో విద్యుదాఘాతంతో కుమ్మరి శ్రీనివాసులకు గుడిసె దగ్ధమైంది. దాదాపు రూ. 5లక్షల ఆస్తి అగ్నికి ఆహుతైంది. ఇంటి యజమాని శ్రీనివాసులు ఆయన భార్య, పిల్లలు కట్టు బట్టలతో మిగిలారు. వారం క్రితం తమ పొలంలో పండిన 8 క్వింటాళ్ల పత్తి, ఆముదాలను శ్రీనివాసులు గుడిసెలో నిల్వ చేసుకున్నాడు. సోమవారం శ్రీనివాసులు భార్య లలితమ్మ, కూతురు మల్లేశ్వరి ఊరి కి వెళ్లారు. మంగళవారం శ్రీనివాసులు, కుమారుడు ఓబులేసు మాత్రమే ఇంట్లో ఉన్నారు. ఉదయం శ్రీనివాసులు మొక్క జొన్నకు నీరు కట్టేందుకు వెళ్లాడు. గుడిసెలో కుమారుడు ఓబులేసు ఒక్కరే ఉన్నారు. ఉదయం 8 గంటల సమయంలో గుడిసెలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో నిప్పురవ్వలు పత్తి పంటపై పడి మంటలు చెలరేగాయి. ఈ కారణంగా పత్తి, ఆముదాలు కాలి బూడిద అయ్యాయి. దీంతో పాటు ఇంట్లో ఉన్న వంట సామగ్రి, బట్టలు, నగదు డబ్బులు, తిండి గింజలు ఇతరత్రా సామగ్రి కాలి బూడిదయ్యాయి. దాదాపు రూ. 5లక్షల మేర పంట నష్టం వాటినట్లు బాధితుడు శ్రీనివాసులు తెలిపాడు. వీఆర్వో ఈశ్వరరెడ్డి సాయంత్రం కాలిపోయిన గుడిసెను పరిశీలించి నష్టం అంచనా వేసి నివేదిక ఉన్నతాధికారులకు పంపారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె..

మహానంది: మహానంది సమీపంలోని ఈశ్వర్ నగర్ కాలనీలో మంగళవారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైంది. కాలనీకి చెందిన నాసరి రాజుకు చెందిన గుడిసెకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. బాధితులు గుర్తించే లోగానే గుడిసెలోని వస్తువులు కాలి బూడిదయ్యాయి. దీంతో బాధితుని కుటుంబం కట్టుబట్టలతో బయట పడ్డారు. చుట్టు పక్కల ఉండే ప్రజలు గమనించి మంటలను ఆర్పివేశారు. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు రాజు కోరారు.

నేడు డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ

కల్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బుధవారం ఉదయం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు డయల్ యువర్ విద్యుత్ ఎస్ఈ నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ ఆర్. ప్రదీప్‌కుమార్ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగాదరులు తమ సమస్యలను మొబైల్ నెంబర్ 7382614308కు ఫోన్ చేసి సమస్యలు తెలపాలని కోరారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం

కర్నూలు న్యూసిటీ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సహకార సంఘాల ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం డిమాండ్ చేశారు. మంగళవారం సీఆర్ భవన్‌లో మాట్లాడుతూ వేతన సవరణతో పాటు పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. ప్రతి ఉద్యోగికి రూ.20 లక్షల టర్మ్ పాలసీ చేయించాలని, ప్రభుత్వం ఉద్యోగులతో సమానంగా సౌకర్యాలు కల్పించాలన్నారు. ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పి.రామక్రిష్ణారెడ్డి, శ్రీనివాసరావు, కృష్ణనాయక్, రాముడు తదితరులు పాల్గొన్నారు

ప్రధాని పదవిని త్యాగం చేసిన సోనియా గాంధీ



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు అర్బన్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): దేశ ప్రధాని పదవి చేపట్టే అవకాశం వచ్చినా దాన్ని సోనియా గాంధీ త్యాగం చేశారని ఎమ్మెల్సీ ఎం సుధాకర్ బాబు అన్నారు. మంగళవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నాయకులతో కలిసి సోనియా గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. దేవ అవసరాల కోసం ఆర్థిక వేత్త మన్మోహన్ సింగ్‌ను ప్రధాని సీట్లో కూర్చోబెట్టారన్నారు. అత్త ఇందిరా గాంధీ, భర్త రాజీవ్ గాంధీలు దారుణ హత్యకు దేశ భద్రత కోసం ప్రాణాలను సైతం లెక్క చేయలేదన్నారు. అనంతరత్నం మాదిగ, ఐఎన్ టీయూసీ జిల్లా అధ్యక్షులు బి. బ్రతుకన్న, సయ్యద్ ఖాద్రీ పాషా, సాంబశివుడు, షేక్ ఖాజా ఉసేన్ తదిరులు పాల్గొన్నారు. బి.క్యాంపు మన వృద్ధాశ్రమంలో పార్టీ కర్నూలు మండల ఇంచార్జీ నాయకురాలు బొగ్గుల హైమావతి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వృద్ధులకు కేక్, పండ్లు పంచారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం



బ్రాహ్మణపల్లెలో మాట్లాడుతున్న తహసీల్దార్ విద్యాసాగర్

ఓర్వకల్లు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ విద్యాసాగర్ అన్నారు. మంగళవారం బ్రాహ్మణపల్లె గ్రామ సచివాలయంలో రీసర్వేపై రైతులతో సమావేశం నిర్వహించారు. రీసర్వే ప్రాజెక్టు ద్వారా ఆదునిక, సాంకేతిక పరిజ్ఞానంతో సర్వే చేసి డిజిటలైజేషన్ చేసి పారదర్శకమైన రికార్డులను రూపొందించామన్నారు. సర్వేయర్ డీటీ షర్మిళ, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

సాధనతో సాధ్యం కానిది లేదు..



జాన్ మిల్టన్‌కు నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు

కర్నూలు అర్బన్ , డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): నిరంతర సాధన చేస్తే సాధ్యం కానిది లేదని క్లస్టర్ వర్శిటీ రిజిస్ట్రార్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాలలో ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో ఇంగ్లీష్ రచయిత జాన్ మిల్టన్ 417వ జయంతి నిర్వహించారు. జాన్ మిల్టన్ అద్భుతమైన రచయిత అన్నారు. ఇంగ్లీష్ నైపుణ్యం ఉంటే గుర్తింపు వస్తుందని విద్యార్థులు గమనించాలని కోరారు. వైస్ ప్రిన్సిపాల్ బీఆర్ ప్రసాదరెడ్డి ఆధ్యాపకులు రాజశేఖర్, నాగ్ అరుణ్, నాగ సురేష్ ఉన్నారు.

21న ఎస్టీ కమిషన్ సభ్యుడికి సన్మానం

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21వ తేదీన గిరిజన భవన్‌లో ఎస్టీ కమిషన్ సభ్యుడు వెంకటప్పకు సన్మానం చేయనున్నట్లు టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు రాగిరి చంద్రప్ప పేర్కొన్నారు. మంగళవారం జిల్లా గిరిజన సంక్షేమాధికారి సురేష్‌కు ఆహ్వానపత్రికను అందజేశారు. వెంకటేశ్, అంజి నాయక్, రాము నాయక్ పాల్గొన్నారు.

ప్రారంభానికి సిద్ధం

- త్వరలో గోవర్ధనగిరి రైతు బజార్ ప్రారంభం..
- సి. క్యాంపు రైతుబజార్ విస్తరణ షురూ



గోవర్ధనగిరి రైతుబజార్ ఇదే

కర్నూలు అగ్రికల్చర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని రైతుబజార్లకు మహర్దశ పట్టనుంది. కల్లూరు ఇండస్ట్రీయల్ ఏరియాలో నిర్మించిన గోవర్ధనగిరి రైతుబజార్‌ను సిద్ధంగా ఉంది. చిన్న చిన్న పనులు పూర్తిచేసి త్వరలో ప్రారంభిచనున్నారు. ఇప్పటి దాకా ఇబ్బంది పడుతున్న రైతులు, వినియోగదారుల ఇబ్బందులు తీరనున్నాయి. తాగునీటి సమస్యతో ఇంతకాలం ప్రారంభం కాలేదు. త్వరలోనే తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏడీఎం నారాయణమూర్తి తెలిపారు.

వినియోగంలోకి తెస్తాం

ఇండస్ట్రీయల్ ఏరియాలో నిర్మించిన గోవర్ధనగిరి రైతుబజార్‌ను త్వరలోనే వినియోగంలోకి తెస్తాం. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రైతు బజారు ఏర్పాటుకు శంకుస్థాపన చేశాం. ఈ రైతుబజార్ వినియోగం లోకి వస్తే చుట్టుముట్టు గ్రామాల రైతులు తాము పండించిన కూరగాయలు విక్రయించునే అవకాశం ఉంది. అలాగే వినియోగదారులకు కూడా మేలు. - నారాయణమూర్తి, ఏడీఎం



సి.క్యాంపు రైతు బజార్ విస్తరణ..

సి.క్యాంపు రైతుబజారుకు అనుబంధంగా పక్కనే ఉన్న ఆర్అండ్ బీ క్వార్టర్లను అప్పగించిన విషయం తెలిసిందే. ఈ పది క్వార్టర్లను కూల్చివేసి ఆస్థలంలో అన్ని సౌకర్యాలతో నూతన రైతు బజార్‌ను నిర్మించేందుకు సీఎం చంద్రబాబు నిధులు మంజూరు చేశారు. త్వరలోనే శంకుస్థాపనకు ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే వెంకటరమణ కాలనీ అమీన్ అబ్బాస్ నగర్ రైతుబజారులో విశాలమైన స్థలం వినియోగంలోకి తెచ్చేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. అలాగే కొత్తపేట రైతుబజారులో మరమ్మతులు చేసి, ఆదాయాన్ని పెంచే దిశగా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

25 స్వర్ణ, 22 రజత పతకాలు..



క్రీడాకారులతో మంత్రి టీజీ భరత్

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరులో నిర్వహించిన రెండో దక్షిణ మండల సీలంబం చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు 25 స్వర్ణాలు, 22 రజత పతకాలు సాధించారు. మంగళవారం రాష్ట్ర మంత్రి టీజీ భరత్ స్వగృహంలో క్రీడాకారులను అభినందించారు. క్రీడాకారులను తీర్చిదిద్దిన కోచ్‌లకు, అసోసియేషన్ సెక్రటరీ మహావీర్‌ను, జాయింట్ సెక్రటరీ బహదూర్ కృషి చేశారన్నారు. జిల్లాలో క్రీడాభివృద్ధి, క్రీడాకారుల సంక్షేమానికి నిరంతరం టీజీవీ సంస్థలు కృషి చేస్తాయన్నారు.

పాడి పశువుల పెంపకంపై దృష్టి పెట్టాలి



'పొలం పిలుస్తోంది'లో వ్యవసాయాధికారులు, రైతులు

కోడుమూరు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతులు సాగుతోపాటు పాడి పశువుల పెంపకంపై దృష్టి పెట్టాలని జేడీఏ వరలక్ష్మీ సూచించారు. మంగళవారం కోడుమూరులో రైతులకు నీరు భూమి యాజమాన్య శిక్షణ పరిశోధన సంస్థ (వలంతరీ) శిక్షణ ఇచ్చారు. వ్యవసాయం అంటే కేవలం పంటలు కాదని, పాడి పశువులకు ప్రాధాన్యమివ్వాలని పెద్దలు గుర్తు చేశారని తెలిపారు. పశువులు, గొర్రెలు, మేకలతో సేంద్రియ ఎరువు లభిస్తుందని, దీనితో నేలను సంరక్షించుకోవచ్చని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంతో పెట్టుబడి తగ్గుతుందని సూచించారు. వలంతరీ డైరెక్టర్ విజయగౌరి మాట్లాడుతూ నవధాన్యాల సాగుతో భూమిలో సేంద్రియ కర్బనం పెరిగి సారవంతమవుతందని, మల్చింగ్ పద్ధతిలో నేలలో తేమ త్వరగా ఆవిరి కాదని తద్వారా కలుపు మొక్కలు నివరించుకోవచ్చని తెలిపారు. ఉష్ణోగ్రతలకు భూమి వేడి కాకుండా ఎండు గడ్డిని మొక్కలపై కప్పి ఉంచాలని సూచించారు. అనంతరం శనగ పంటపై పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఏడీఏలు సాలురెడ్డి, వెంకటేశ్వర్లు, ఎంఏవో రవిప్రకాష్‌గౌడ్, వలంతరీ ఏవో అన్నపూర్ణ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ

కర్నూలు కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లెలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో కర్నూలుకు చెందిన రితేష్ రాయల్, హిమలాస్య కాంస్య పతకాలు సాధించారు. నగరంలోని సిస్టర్ స్టానిస్లాస్ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న రితేష్ రాయల్, మాంటిస్సోరి ఇంటర్నేషనల్ స్కూల్‌లో 3వ తరగతి చదువుతున్న హిమలాస్య కరాటే మాస్టర్ వై. అరుణ్‌కుమార్ నేతృత్వంలో శిక్షణ తీసుకుంటున్నారు. అండర్ 10 విభాగంలో కాంస్య పతకాలు సాధించిన చిన్నారులను మంగళవారం గాంధీటవర్స్ అపార్ట్‌మెంట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎన్. విరూపాక్షిరెడ్డి, వి. మధు, కోశాధికారి ఎం.శ్రీనివాసరాజు, మాస్టర్ వై.అరుణ్‌కుమార్ అభినందించారు.



చిన్నారుల అభినందిస్తున్న విరూపాక్షిరెడ్డి, మధు

గర్భిణులకు పరీక్షలు

కోడుమూరు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీలో పీఎంఎస్ఎ కింద గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి నాగరాజు తెలిపారు. గైనకాలజిస్టు డాక్టర్ ప్రగతి 107 మంది గర్భిణులకు స్కానింగ్, రక్తపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారన్నారు. అసుపత్రిలో అన్ని రకాల వైద్యసేవలు, కుటుంబ నియంత్రణ, సిజేరియన్ శస్త్రచిత్సలు అందుబాటులో ఉన్నాయని రోగులు వినియోగించుకోవాలని కోరారు.

మహిళలపై హింస అరికట్టండి

కర్నూలు ఎడ్యుకేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహిళలపై హింసను ప్రభుత్వం అరికట్టాలని ఐద్వా జిల్లా కార్యదర్శి కె.అరుణ డిమాండ్ చేశారు. మంగళవారం కేవీఆర్ జూనియర్ కళాశాలలో 'హింసా వ్యతిరేక దినోత్సవం' నిర్వహించారు. రచయిత కళ్యాణదుర్గం సువర్ణలత, ప్రిన్సిపాల్ ప్రభు, అరుణ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులపై, మహిళలపై హింస రోజురోజుకూ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రక్షణ చట్టాలు ఉన్నా అవేవీ మహిళలకు భద్రత కల్పించలే కపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి పద్మ, కోశాధికారి సుజాత పాల్గొన్నారు.

జాతీయ జిమ్నాస్టిక్ పోటీలకు విద్యార్థిని ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కలకత్తాలో నిర్వహించనున్న జాతీయ స్కూల్ గేమ్స్+2 విభాగం జిమ్నాస్టిక్ పోటీలకు వెల్దుర్తి అంబేడ్కర్ గురుకుల కళాశాల జూనియర్ ఇంటర్ విద్యార్థి సంధ్యపోగు మయూరి ఎంపికైందని జిల్లా కార్యదర్శి రాఘవేంద్ర తెలిపారు. మహారాష్ట్రలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిందన్నారు. అలాగే డిసెంబరు 4 నుంచి 6 వరకు కాకినాడలో నిర్వహించిన రాష్ట్ర స్కూల్ గేమ్స్ అండర్-19లో రిథమిక్ విభాగంలో బ్రౌంచ్ మెడల్ సాధించిందన్నారు. ప్రిన్సిపాల్ లక్ష్మి ప్రసన్న, డీసీవో శ్రీదేవి అభినందించారు.



సంధ్యపోగు మయూరి

13న క్రాస్ కంట్రీ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సిల్వర్ జూబ్లీ కళాశాల మైదానంలో 13న ఉమ్మడి జిల్లాల అథ్లెట్స్ క్రాస్ కంట్రీ పోటీలు నిర్వహి స్తున్నట్లు జిల్లా కార్యదర్శి సుబ్బరత్నాలు తెలిపారు. 16, 18, 20 ఏళ్ల బాలబా లికలు, మెన్, ఉమెన్ విభాగాల్లో ఉంటా యన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 24న పెద్దాపురంలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. 8919409232, 9866494372 నంబర్లను సంప్రదించాలన్నారు.

హాకీ క్రీడాకారులు రిపోర్టు చేయాలి

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 హాకీ బాలికల పోటీల క్రీడాకారులు కర్నూలు డీఎస్ఏ స్టేడియంలో రిపోర్టు చేయాలని ఉమ్మడి జిల్లాల స్కూల్ గేమ్స్ కార్యదర్శులు టి.కృష్ణ, నాగేశ్వరి, బి.విశ్వనాథ్, ఆశా జ్యోతి తెలిపారు. ఈ నెల 11 నుంచి 13 వరకు నెల్లూరులో పోటీలు ఉంటాయని, ఉమ్మడి జిల్లా క్రీడాకారులు వెంటనే రిపోర్టు చేసుకోవాలన్నారు.

'జూనియర్ అసిస్టెంట్‌కు కీలకమైన విధులా?'

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కీలకమైన హెచ్‌డీఎస్, ఆరోగ్యశ్రీ, డ్రగ్స్ సర్జికల్స్ సీటును ఓ జూనియర్ అసిస్టెంట్ ఎలా నిర్వహిస్తారని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు పీటీ సాయి ప్రదీప్ ప్రశ్నించారు. మంగళవారం మాట్లాడుతూఖాళీగా ఉన్న నాలుగు సీనియర్ అసిస్టెంట్లు పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కడప ఆర్‌డీ డా.రామగిడ్డయ్యకు లేఖ రాశారన్నారు. పరిపాలన విభాగంలో సీనియర్ అసిస్టెంట్లు ఉండగా వారికి హెచ్‌డీఎస్, ఆరోగ్యశ్రీ, డ్రగ్స్ సీటును కేటాయించకుండా అనుభవం లేని ఓ జూనియర్ అసిస్టెంట్‌తో నిర్వహించడం సరికాదన్నారు. కొందరు జూనియర్ అసిస్టెంట్లు పదోన్నతి వచ్చినా వెళ్లకుండా కొనసాగుతున్నారన్నారు. ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహించడం సరికాదన్నారు. తక్షణమే పరిపాలన విభాగాన్ని ప్రక్షాళన చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఉమ్మడి జిల్లా క్రీడలు ప్రారంభం

కర్నూలు స్పోర్ట్స్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగర సమీపంలోని చిన్నటేకూరు వద్ద ఉన్న ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడా పోటీలు మంగళవారం ప్రారం భమయ్యాయి. స్కూల్ చైర్మన్ కేజే రెడ్డి, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయు పోటీలను ప్రారంభించారు. కేజే రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలో క్రీడా పోటీలను నిర్వహించడం సంతోషకరమన్నారు. ఈ ప్రాంతంలో స్పోర్ట్స్ సిటీ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ జస్మిత్, 400 మంది క్రీడాకారులు, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు. అంతకు ముందు చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



పోటీలను ప్రారంభిస్తున్న కేజే రెడ్డి, ప్రిన్సిపాల్ జస్మిత్

పూర్తయ్యేదెన్నడు?



నగర పంచాయతీ పరిధిలో తాగునీటి పథకం ట్యాంకు పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. దాదాపు 30 వేల మంది నివసిస్తున్నారు. ప్రస్తుతం ఉన్న నీటి పథకం సరిపోవడం లేదు. దీంతో గత ప్రభుత్వం రూ.54కోట్లతో తాగునీటి పథకంలో భాగంగా మూడు ఓవర్ హెడ్ ట్యాంకులు, సంపు నిర్మించాలని ఉద్దేశించారు. నిధుల కోరతతో పనులు నిలిచిపోయాయి. ఇప్పటికైనా నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేసి దాహార్తిని తీర్చాలని ప్రజలు కోరుతున్నారు.
- గూడూరు

ప్రివిలేజ్ కమిటీలో కోడుమూరు ఎమ్మెల్యే

కర్నూలు రూరల్ డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోడుమూరు శాసన సభ్యుడు దస్తగిరి అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీలో పాల్గొన్నారు. మంగళవారం అమరావతిలోని మీటింగ్ హాల్‌లో ప్రివిలేజ్ కమిటీ చైర్మెన్ పితాని సత్యానారాయణ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే నియోజకవర్గ సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు.



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే దస్తగిరి

చిన్నారి గొంతులో ఇరుక్కున్న నాణెం

- ఎండోస్కోపీ ద్వారా బయటకు తీసిన వైద్యులు



బాలికతో మెడికవర్ హస్పిటల్ వైద్యులు

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తుగ్గలి మండలం చెన్నంపల్లికి చెందిన బాలిక లాస్య(7) ఆడుకుంటూ ఆదివారం రాత్రి రెండు రూపాయల నాణేం మింగింది. నాణేన్ని నోట్లో పెట్టుకుని ఆడుకుంటున్న సమయంలో గొంతులోకి పోయి అన్నవాహికలో ఇరుక్కుంది. తల్లిదండ్రులు సోమవారం కర్నూలు మెడికవర్ హాస్పిటల్‌కు తీసుకుని వచ్చారు. గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డా.అబ్దుల్ సమద్ ఎక్స్‌రే తీయగా గొంతులో నాణేం ఉన్నట్లు గుర్తించి, ఎండోస్కోపీ సాయంతో శస్త్ర చికిత్స అవసరం లేకుండా నాణేన్ని సురక్షితంగా బయటకు తీశారు. బాలికను మంగళశారం డిశ్చార్ చేశారు. గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.అబ్దుల్ సమద్ మాట్లాడుతూ పిల్లలు నాణేలు, ఇనుప వస్తువులు, పిన్నులు నోట్లో పెట్టుకోకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. డా.సమద్, పిడియాట్రిషన్లు డా.సింధూరా, డా.వై.గణేష్‌కు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

'గోకులం' నిర్మాణం వేగవంతం చేయండి



గోకులం షెడ్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

కోడుమూరు రూరల్, డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి): మండలంలో గోకులం షెడ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో రాముడు లబ్దిదారులను కోరారు. మంగళవారం పులకుర్తిలో షెడ్ల నిర్మాణాలు పరిశీలించారు. పశు సంరక్షణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తుందని, నిర్మాణం పూర్తి చేసుకుని లబ్ధి పొందాలని సూచించారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ..

అంగన్‌వాడీ సెంటర్‌లో పౌష్టికాహారం, ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. భోజనం నీడ ప్రదేశంలో వడ్డించాలని, పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులను హెచ్చరించారు. సచివాలయంలో సిబ్బంది హాజరు పరిశీలించారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలన్నారు.

అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకం

కర్నూలు లీగల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కర్నూలు 4, 7వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టులకు ఇద్దరు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా నాల్గవ అదనపు జిల్లా కోర్టుకు అడిషినల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఏ.శ్రీనివాస భట్టును నియమించింది. ఈయన 1996లో డోన్ కోర్టులో ప్రాక్టీసును ప్రారంభించి తర్వాత 2007 నుంచి కర్నూలు జిల్లా కోర్టులో ప్రాక్టీసు చేస్తున్నారు. అలాగే కర్నూలు 7వ అదనపు జిల్లా కోర్టుకు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా మహిళా న్యాయవాది యు.వి.లక్ష్మిని నియమించింది. ఈమె 34 ఏళ్లుగా న్యాయవాదిగా పని చేస్తున్నారు. గతంలో గవర్నమెంట్ ఫ్లీడర్‌గా కూడా పని చేశారు. వీరిద్దరు బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచి మూడేళ్లపాటు పదవిలో కొనసాగుతారు. వీరి నియా మకం పట్ల బార్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.



శ్రీనివాస భట్టు

మత్తుకు దూరంగా ఉండాలి

కర్నూలు కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ పార్వతి సూచించారు. వీహెచ్‌పీ, అనుబంధ మహిళా సంస్థలైన మాతృశక్తి, దుర్గావాహిని ఆధ్వర్యంలో నగరంలోని కేవీఆర్ మహిళా డిగ్రీ కళాశాల, పాతనగరం వాసవి మహిళా కళాశాలల్లో 'నషాముక్త్ భారత్ అభియాన్' అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. డాక్టర్ పార్వతి, మాళిగి పావని మాట్లాడుతూ దేశంలో యువశక్తి అధికంగా ఉందని, ప్రపంచ దేశాలన్నీ భారతదేశ యువశక్తి పట్ల ఆసక్తి చూపిస్తున్నాయన్నారు. యువత సరైన దారిలో నడవాలన్నారు. అధ్యాపకులు సాహిత్య, మాతృశక్తి రాష్ట్ర కోకన్వీనర్ జంపాల రాధిక, దుర్గావాహిని రాష్ట్ర కన్వీనర్ ఈపూరి లక్ష్మి, కన్వీనర్ గౌరి ఉన్నారు.

మహిళలు స్వశక్తితో అభివృద్ధి చెందాలి



మహిళలతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్

- రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

కర్నూలు హాస్పిటల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వశక్తితో అభివృద్ధి చెందాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డా.రాయపాటి శైలజ సూచించారు రెండో రోజు పర్యటనలో భాగంగా మంగళవారం నగరంలోని సూర్య భవన్ ఆలయం సమీపంలోని శక్తి సదన్‌ను సందర్శించారు. వసతి గృహంలో ఉన్న వారితో మాట్లాడుతూ అవసరమైన వారికి లీగల్ కౌన్సెలింగ్, సైకాలజికల్ సపోర్టు అందించాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.విజయను ఆదేశించారు. వంటగది, పడకగదులు, చేతిఅల్లిక యూనిట్లు, కుట్టుమిషన్లు శిక్షణ విభాగాలను పరిశీలించారు. మహిళా స్వశక్తీకరణలో భాగంగా జన్-ధన్ ఖాతాలో నెలకు ప్రభుత్వం జమచేస్తున్న రూ.500లు డిపాజిట్లు సరైన విదంగా చేరుతున్నాయో లేదా పరిశీలించారు. ఖాతాల వివరాలు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. వసతి గృహం నుంచి చదివి నలుగురు పోలీసు ఉద్యోగలు, నలుగురు నర్సింగ్, ఐసీడీఎస్ విభాగాల్లో ఉద్యోగాలు సాధించారన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.విజయ, శక్తి ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి విజయరాజు పాల్గొన్నారు.

ఆదోని

ఆదోని ● పత్తికొండ ● ఆలూరు

‘ఎస్ఐఆర్ ’ పై సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి భరత్‌నాయక్

వెల్దుర్తి, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ‘ ఎస్ఐఆర్ ’ పై ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి(ఆర్డీఓ) భరత్‌నాయక్ రెవెన్యూ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ(ఎస్ఐఆర్) లో వెల్దుర్తి మండలం అధ్వానంగా ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. పురోగతి సాధించాలని ఆదేశించారు. సలహాలు, సూచనలు తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గురుస్వామి, వీఆర్వోలు పాల్గొన్నారు.

పప్పుశనగ పంటకు ‘కడి తెగులు ’

మద్దికెర, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలో రబీలో సాగు చేసిన పప్పుశనగ పంటకు కడితెగులు సోకడం వల్ల పప్పుశనగ పంట ఎండిపోతుందని వ్యవసాయ శాఖ అధికారి రవి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని బురుజుల, మద్దికెర గ్రామాల్లో రైతులు సాగు చేసిన పప్పుశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 18వేల ఎకరాల్లో పప్పుశనగను సాగు చేశారన్నారు. ప్రస్తుతం పప్పుశనగ పూత, పిందె దశలో ఉందన్నారు. ఈ సమయంలో భూమి నుంచి వచ్చే తెగుళ్లు అధికంగా ఆశించడం వల్ల పప్పు శనగ పంట తెగుళ్లతో ఎండిపోతుందన్నారు. పప్పుశనగ పంటకు ఎండ వేరుకుళ్లు తెగుళ్లు ఆశించి పంట మొత్తం పసుపు రంగులోకి మారి చనిపోతుందన్నారు తెగుళ్ల నివారణ కోసం ప్రొతినెబ్ అను మందును ఎకరాకు 400 గ్రాములు, సాఫ్ 400 గ్రాములు లేదా, కుప్రోతిక్స్ ఎకరాకు400 గ్రాములు, లేదా కోపోస్రైడ్ అనే మందును ఎకరాకు 250 గ్రాములు, రేడీయం అనే మందును ఎకరాకు 200 మిలీలీటర్లు, టెబ్‌కోనోజల్ అనే మందును ఎకరాకు 200 మి.లీ మొక్కల వేర్లు బాగా తడిచేలా పిచికారి చేయాలన్నారు. ట్రైకోడర్మా 2కేజీలు, సురోమోనస్ 2 కిలోలు ఉదయానే 10 కిలోల ఇసుకలో కలిపి పిచికారి చేయాలన్నారు. మరిన్ని వివరాల కోసం వ్యవసాయాధికారులను సంప్రదించాలన్నారు.

ఖాతాదారులతో దురుసు ప్రవర్తన

దేవనకొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ‘మేము మహేష్ బాబు సినిమా చూడటం లేదు. నాపక్కన నిలుచోని చుద్దురా’ అంటూ మహిళా ఖాతాదారుతో దేవనకొండ ఆంధ్రప్రదేష్ గ్రామీణబ్యాంకు క్యాషియర్ శ్రీకాంత్ విరుచుకుపడ్డారు. పొదుపు రుణాల నెలసరి కంతులు కట్టేందుకు ఉదయం నుండి సాయంత్రం నాలుగైన కుడా పని చేయకపోవడంతో ‘ఎంతసేపు ఆగాలి సారు, ఇంటి దగ్గర జ్వరం వచ్చిన పిల్లాడిని వదిలివచ్చాన’ంటూ ఆవేదన వ్యక్తం చేసిన మహిళపై, క్యాషియర్ దురుసుగా మాట్లాడాడు. మేనేజర్ సుగుణాకర్‌ను వివరణ కోరగా పని ఒత్తిడి పెరిగిందని ఖాతాదారులు అర్థం చేసుకుని నిరీక్షించాలని తెలిపారు.

సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఆలూరు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పంటల సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని బనవాసి కేవీకే శాస్త్రవేత్త రాఘవేంద్రచౌదరి అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో నేషనల్ మిషనల్ ఎడిబుల్-ఆయిల్ సీడ్స్ పథకం కింద ఆలూరు, హాలహర్వి, హొళగుంద రైతులకు వేరుశనగ (టీసీజీఎస్ 1694) విత్తనాలను శాస్త్రవేత్త రాఘవేంద్రచౌదరి, ఏడీఏ చెంగల్ రా యుడు, ఏవో వెంకటేశ్వరగౌడ్ అందజేశారు. వ్యవసాయ సిబ్బంది జిలాన్ బాషా, ఆనంద్, ఎఫ్‌పీవో చంద్రమోహన్, ఏఈవో శివప్రసాద్, నరేష్, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కలకు వ్యాక్సిన్లు వేయిస్తాం

మద్దికెర, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో వీధి కుక్కలకు వ్యాక్సిన్లు వేయిస్తామని డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. మంగళవారం ‘ఆంధ్రజ్యోతి’లో కుక్కల దాడిలో 11 మందికి గాయాలు అనే వార్తకు స్పందించిన ఆమె పంచాయతీ కార్యద ర్శుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని 11 గ్రామాల్లోని వీధి కుక్కల అన్నింటికి పశువైద్యాధికారి సహకారంతో వ్యాక్సిన్లు వేయిస్తామ న్నారు. పంచాయతీ కార్యదర్శులు విజయకుమార్, పరమేశ్వరప్ప, వన్నూరప్ప, హరికృష్ణ పాల్గొన్నారు.

రక్షణ కంచె ఏర్పాటు చేయండి

దేవనకొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): దేవనకొండలో విద్యుత్ ట్రాన్స్‌పార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయని వాటికి రక్షణ కవచాలు ఏర్పాటు చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి రాజశేకర్, ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి భాస్కర్ అన్నారు. కర్నూలు ప్రధాన రహదారి, గ్రామపంచాయతి కార్యాలయం వద్ద ట్రాన్స్‌పార్మర్లు చేతికందేలా కిందనే ఉండటంతో ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉందని, ఇప్పటికే విద్యుధాఘానికి గురై చాలా కోతులు మృతి చెందాయన్నారు. తక్షణమే ట్రాన్స్‌పార్మర్లుకు రక్షణ కవచాలు ఏర్పాటు చేసి ప్రమాదాలు నివారించాలన్నారు. వీరాంజి, రామాంజినేయులు పాల్గొన్నారు.



ట్రాన్స్‌ఫార్మర్‌ను చూపుతున్న నాయకులు

గురుకుల పాఠశాలలో తనిఖీలు?

● ఏ విషయం చెప్పని అధికారులు

వెల్దుర్తి టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి పట్టణ సమీ పంలోని జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలో మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి రెండు కార్లలో వచ్చిన అధికారుల మంటూ వచ్చి విస్తృతంగా తనిఖీలు చేశారు. ముందుగా గురుకుల ప్రిన్సిపాల్ కారును స్థానిక హాస్పిటల్ వద్ద నిలిపి తనిఖీలు చేశారు. అయితే. అక్కడి నుంచి ప్రిన్సిపాల్ కారును, ప్రిన్సిపాల్‌ను పాఠశాలలోకి తీసుకుని వెళ్లారు. అక్కడి నుంచి ఏం జరిగిందనే సమాచారం పూర్తిగా కారులో ఉన్న ఏ వ్యక్తిని అడిగినా పూర్తి సమాచారం ఇవ్వలేదు. మా డీఎస్పీ వస్తారూ.. వారే సమాధానం చెబుతారంటూ వచ్చారు. రాత్రి 10 గంటల వరకు అధికారులమంటూ చెప్పుకుంటున్న ఇద్దరు వ్యక్తులు బాలికల పాఠశాలల్లోనే ఉన్నారు. ఈ విషయంపై పాఠశాల చైర్మన్‌ను అడిగినా నాకు ఎటువంటి సమాచారం లేదని దాటవేశారు. ఆంధ్రజ్యోతి ప్రశ్నించగా.. వారిలో ఒకరు మేం ఏసీబీ అధికారులమని తెలిపారు. ఎందుకు వచ్చారని చెప్పాలని ప్రశ్నించగా.. వారు అక్కడి నుంచి జారు కున్నారు. ఈ విషయంపై మహిళా కానిస్టేబుల్ సైతం పాఠశాలలోకి వెళ్లింది.. అయితే స్థానిక పోలీసులను అడిగినా వారు కూడా సమాధానం దాటవేశారు. ఈ తనిఖీలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఏళ్ల నాటి ప్రజల కల.. ఆదోని జిల్లా

● దీక్షలో నాయీ బ్రాహ్మణులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు
● సంఘీభావం తెలిపిన డాక్టర్లు
● నేడు ఆదోని బంద్‌కు జేఏసీ పిలుపు



దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్



ఉమాపతినాయుడును బంద్‌లో పాల్గొనాలని కోరుతున్న జేఏసీ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ ప్రాంత ఐదు నియోజకవర్గాలను కలిపి ఆదోని జిల్లా చేయాలన్న ప్రజల కల ఏళ్ల నాటిదని జిల్లా సాధన సమితి జేఏసీ నాయకులు లలిత జితేంద్ర, రఘురామయ్య, అశోక్ నంద రెడ్డి , కృష్ణమూర్తి గౌడ్, కోదండ, టి వీరేష్, కుంకనూరు వీరేష్, దస్తగిరి నాయుడు అన్నారు. ఆదోని జిల్లా సాధన కోసం పట్టణంలోని కోట్ల కూడలిలో జేఏసీ తలపెట్టిన దీక్షలు 24వ రోజుకు చేరుకున్నాయి. ఆదోని జిల్లాగా ప్రకటించాలని చేపట్టిన దీక్షలో నాయి బ్రాహ్మణులు కాంగ్రెస్ పార్టీ నాయకులు దిలీప్ దోకా, సాయినాథ్, దేవిశెట్టి వీరేష్, శ్రీనిధి, ఫరూక్, గౌడ్ ఈరన్న, మునిస్వామి, రంగస్వామి, వీఎం వీరన్న, భైరుపాలకృష్ణ, హరిదేవేంద్ర మరికొంతమంది కూర్చోగా వారికి పలు ప్రజా సంఘాలు, కుల సంఘాలు, డాక్టర్లు సంఘీభావం తెలిపారు.

నేడు ఆదోని సంపూర్ణ బంద్

నేడు ఆదోని జిల్లా చేయాలని ప్రజల డిమాండ్‌ను నెరవేర్చాలని జిల్లా సాధన సమితి జేఏసీ నాయకులు సమావేశమయ్యారు. మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్, నూర్ అహ్మద్, దేవిశెట్టి ప్రకాష్, నీలకంఠ, బసవరాజ్ స్వామి, కుంకునూరు వీరేష్, అశోక్ నందిరెడ్డితోపాటు పలు సంఘాలు పాల్గొని నేడు సంపూర్ణ బంద్‌కు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

● **ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు సంఘీభావం**

ఆదోని జిల్లా కోసం ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు సంఘీభావం ప్రకటించారు. డాక్టర్ గోపీనాథ్, శ్రీనివాసులు, ఓ ఎం కృష్ణమూర్తి తోపాటు మరికొంతమంది వైద్యులు వచ్చి జిల్లా సాధించుకునేంతవరకు పోరాటాలకు తమ మద్దతు ఉంటుందన్నారు.

ఆదోని బంద్‌కు టీడీపీ సంపూర్ణ మద్దతు

ఆదోని: ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ ఆదోని జిల్లా సాధన సమితి 10న బంద్‌కు పిలుపునివ్వడంతో, ఆ బంద్‌కు టీడీపీ సంపూర్ణ మద్దతు ప్రకటించిందని జేఏసీ నాయకులు రఘురామయ్య, అశోకానందరెడ్డిలు తెలిపారు. మంగళవారం టీడీపీ సీనియర్ నేత ఉమాపతినాయుడు కార్యాలయంలో జేఏసీ నాయకులు సమావేశమయ్యారు. బుధవారం జరిగే సంపూర్ణ బంద్‌కు టీడీపీ మద్దతు ఇవ్వాలని ఉమాపతినాయుడిని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఉమాపతినాయుడు పార్టీ తరపున పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ బంద్‌లో పెద్ద సంఖ్యలో ప్రజలు, వ్యాపార వర్గాలు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని టీడీపీ శ్రేణులు పిలుపునిచ్చాయి.



మండల కార్యాలయ అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న 16 గ్రామాల ప్రజలు

ఆదోని రూరల్ : మా 16 గ్రామాల గోడును ప్రభుత్వానికి తెలపాలని గోనేహాళ్ గోపాల్‌రెడ్డి, గణేకల్ విరుపాక్షి, బసాపురం రామస్వామి, మదిరె సర్పంచ్ నారాయణ, సంతేకుడ్లూరు సర్పంచ్ భీమేష్, చిన్నహరివాణం సర్పంచ్ రామకృష్ణారెడ్డిలు కోరారు. గణేకల్, చాగి, బసాపురం, డణాపురం, నారాయణపురం, కడితోట, చిన్నహరివాణంతోపాటు 9 గ్రామాలను నూతన మండలం పెద్దహరివాణంలో కలపడాన్ని నిరసిస్తూ, ఆయాగ్రామాల ప్రజలు ర్యాలీగా ఎంపీడీఓ కార్యాలయాన్ని మంగళవారం ముట్టడించి ఆందోళన చేపట్టారు. ఈఓపీఆర్‌డీ మల్లికార్జున, సీనియర్ అసిస్టెంట్ వీరభద్ర స్వాములకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, నారాయణపురం కారుమంచి, నాగనాథనహళ్ళి గ్రామ సర్పంచ్ వరదప్ప, మల్లికార్జున, మణేమ్మ, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం ప్యాకెట్లు స్వాధీనం

ఆలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆలూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని చిప్పగిరి మండలం నేమకల్ గ్రామానికి చెందిన పులికొండ నుంచి 30 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆలూరు ఎక్సైజ్ సీఐ లలితదేవి తెలిపారు. ఎక్సైజ్ డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ తేజ ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో అదే గ్రామానికి చెందిన పులికొండపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కర్ణాటక మద్యం రవాణాపై నిఘా ఉంచామన్నారు.

ప్రైవేటీకరణను విరమించుకోవాలి

పత్తికొండ టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పరిపాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను విరమించుకోవాలని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. మంగళవారం స్థానిక మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. మెడికల్ కళాశాలల నిర్మాణాలకు రూ.5 వేల కోట్లు వెచ్చిస్తే నిర్మాణాలు పూర్తి అవుతాయని, అలా చేయలేక మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం సరైంది కాదన్నారు. నారాయణదాస్, శ్రీరంగడు, సోమశేఖర్, బాబుల్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంగాటిశ్రీదేవి

వాటర్ షెడ్ నిధులు వినియోగించుకోవాలి

హాలహర్వి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రైతుల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన వాటర్‌షెడ్ పథకం నిధులు సద్వినియోగం చేసుకోవాలని ప్రాజెక్టు అధికారి వలిబేగ్ అన్నారు. మంగళవారం హాలహర్విలో సర్పంచ్ మల్లికార్జున అధ్యక్షతన వాటర్‌షెడ్ అత్యవసర కమిటీ సమావేశం నిర్వహించారు. హాలహర్వి, బాపురం, మాచనూరు గ్రామాలకు సంబంధించి రూ.2 కోట్లు నిధులు మార్చి చివరికంతా పూర్తి చేయాలన్నారు. లేకపోతే నిధులు వెనక్కి వెళ్లిపోతాయన్నారు. దీంతో వాటర్‌షెడ్ కమిటీ చైర్మన్లు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఫిబ్రవరి నెలాఖరి పొలాల్లో పంటలు ఉంటాయని, పనులు చేయడం ఇబ్బందిగా మారుతుందని మరో రెండు నెలలు గడువు ఇవ్వాలని కోరారు. ఇది మా పరిధిలో లేదని, ఉన్నతాధికారులు నిర్ణయమని తెలిపారు. ఈ విషాయన్ని ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి దృష్టికి తీసుకెళ్తామని మండల కన్వీనర్ శ్రీ దర్ తెలిపారు. రెండు నెలలు గడువు పెంచేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వాటర్‌షెడ్ ఏఈ పురుషోత్తంరెడ్డి, గోవిందప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రాజెక్టు అధికారి వలిబేగ్

టీబీపై సమీక్ష

ఆదోని టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శంకర్ నగర్, ఇందిరా నగర్, హావన్నపేట ప్రాంతాలకు చెందిన అర్బన్ హెల్త్ సెంటర్‌లలో మంగళవారం టీబీ వ్యాధిపై సమీక్షా కార్యక్రమం నిర్వహించారు. టీబీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శేఖర్ భాను మాట్లాడుతూ, క్షయ వ్యాధి నిర్ధారణ కోసం ప్రభుత్వం 100 రోజుల స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. డా పృథ్వీరాజ్, బాబురాజు, జ్ఞానేశ్వరి, మేరీ అరుణ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి

మద్దికెర, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకంతో నిర్మిస్తున్న నూతన పంచాయతీ భవనం పనులు వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని బొమ్మనపల్లి గ్రామంలో పంచాయతీ భవనం పనులను పరిశీలించారు. ప్రత్యేక పంచాయతీ ఏర్పడి ఐదేళ్లు దాటినా పంచాయతీ భవనం లేక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఉపాధి హామీ పథకం కింద రూ.50 లక్షలు మంజూరు కావడంతో పనులు మొదలెట్టారనీ తెలిపారు. పనుల్లో నాణ్యత ఉండాలన్నారు. సర్పంచ్ బొమ్మనపల్లి ఆంజనేయులు ఉన్నారు.

వేరుశనగను తెగుళ్ల నుంచి కాపాడుకోండి

తుగ్గలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వేరుశనగ పంటను ఆశించే తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవాలని మండల వ్యవసాయాధికారి సురేష్ యాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పగిడిరా యిలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో వ్యవసాయ తోటల్లో సాగు చేసిన వేరుశనగ పంటలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ వేరు శనగ పంటను ఆశించే వేరుకుళ్లు తెగుళ్లు, మచ్చతెగుళ్లు, కాయతెగుళ్లు, కుళ్లు తెగులుతో పాటు వంటి చీడపీ డల నుంచి కాపాడుకుని నివారణ మందులు పిచికారి చేయాలన్నారు. అంతేగాకుండా అధిక మోతాదులో మందులు పిచికారి చేయవద్దన్నారు. ఏవో లక్ష్మీనారాయణ, డీలర్ సుంకన్న పాల్గొన్నారు.

శాంతియుతంగా దేవర నిర్వహించుకోవాలి



సిబ్బందికి సూచనలు ఇస్తున్న తాలుకా సీఐ

ఆదోని రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యం వహించ కుండా ఎవరికి ఇచ్చిన విధులను వారు నిర్వర్తించాలని తాలుకా సీఐ నల్లప్ప తెలిపారు. రెండు రోజులపాటు నెట్టేకల్‌లో జరిగే సుంకలమ్మ, పెద్దమ్మవ్వ దేవి దేవర సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు నిర్వ హించారు. మంగళవారం సాయంత్రం నుంచి దాదాపు 100మందికిపైగా పోలీసులు గ్రామానికి చేరుకొని కవాతు నిర్వహించి గ్రామస్థులతో సమావేశం ఏర్పాటుచేశారు. మద్యం తాగి అల్లర్లకు పాల్పడకుండా శాంతియుత వాతావరణంలో దేవర ఉత్సవాలను నిర్వహించుకోవాలని ప్రజలకు సీఐ సూచించారు. ముఖ్యంగా అల్లర్లకు పాల్పడేవారిపై ప్రత్యేక నిఘా ఉంచామని, అలాంటి వారిని డ్రోన్, సీసీ కెమెరాల ద్వారా గుర్తించి శాఖపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలి

మద్దికెర, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసినేపల్లి గ్రామానికి మజరా గ్రామంగా ఉన్న మదనంతపురం గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీ చేయాలని గ్రామ ప్రజలు కోరారు. మంగళవారం మదనంతపురం గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీ చేయాలని డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసీ సభ్యులు జమేదార్ రాజన్న యాదవ్, బొమ్మనపల్లి సర్పంచ్ ఆంజనేయులు, మదనంతపురం నాయకులు ప్రసాద్ మాట్లాడుతూ మదనంతపురం గ్రామంలో మొత్తం 3వేల జనాబా ఉందన్నారు. బసినేపల్లి గ్రామం కన్నా మదనంతపురం పెద్ద గ్రామం అని, బసినేపల్లి గ్రామానికి వెళ్లడానికి తమ గ్రామం నుంచి 3 కిలోమీటర్ల దూరం ఉందని, అంతేగాక రవాణా సౌకర్యాలు కూడా లేదన్నారు. డిప్యూటీ ఎంపీడీవో విజయలక్ష్మి మాట్లాడుతూ జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు నెట్టికంటి నాగన్న, గోపాల్, జయరాముడు, హరీష్, చర్లప్ప, రంగస్వామి, లింగమయ్య, ఆనంద్, లక్ష్మన్న, భగత్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆలూరు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల కనీస వేతనాలు, సమస్యల పరిష్కారానికై ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు బాలరంగమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్వాడీలుగా మారాచలని తదితర సమస్యలను పరిష్కరించాలని ఆలూరు ప్రాజెక్టు సూపర్‌వైజర్ వైసర్‌సీబాకు వినతి పత్రం అందించారు. ఈనెల 12న కర్నూలు కలెక్టరేట్ ఎదుట జరిగే ఆందోళన కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. అంగన్‌వాడీ వర్కర్లు ప్రశాంతి, విశాలాక్షమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్ : అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా సీఐటీయు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గోపాల్, తిప్పన్నలు తెలిపారు. మంగళవారం సిఐటీయు కార్యాలయంలో అంగన్‌వాడీల విస్తృత సమావేశం వరలక్ష్మీ అధ్యక్షతన నిర్వహించారు. ఈనెల 12వ తేదిన కర్నూలు కలెక్టరేట్ కార్యాలయ ముట్టడి ఉంటుందని, కావున అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటమ్మ, సరోజమ్మ, సోమక్క, పద్మ, గీత, రేణుక, లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

వేగం కన్నా.. ప్రాణం మిన్న : డీఎస్పీ

పత్తికొండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):వేగం కన్నా..ప్రాణం ఎంతో మిన్నా అని వాహనదారులు అన్ని జాగ్రత్తలతో వాహనాలు నడపాలని డీఎస్పీ వెంకటరామయ్య అన్నారు. రహదారి భద్రత వారోత్సవాలలో భాగంగా మంగళవారం పత్తికొండ పోలీస్‌స్టేషన్‌లో గోడపత్రికలను ఆయన విడుదల చేశారు. అనంతరం వాహనదారులను ఉద్దేశించి మాట్లాడుతూ హెల్మెట్ ధరించి వాహనం నడపకపోవడం, మద్యం సేవించి వాహనం నడపడడం నిబంధనలకు విరుద్ధమని అన్నారు. కార్యక్రమంలో సీఐ జయన్న, పులిశేఖర్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

మిరప పంటను రక్షించుకోవాలి

ఆదోని రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మిరప పంటను సస్యరక్షణ ద్వారా రక్షించుకోవాలని హార్టికల్చర్ అధికారులు రఘువరన్, స్వరూపలు తెలిపారు. మంగళవారం మదిరె గ్రామంలో మిరప పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాత్రి ఉష్ణోగ్రత తగ్గడం, ఉదయం పొడి వాతావరణం, చలి వలన మిరపకు తెగుళ్లు వస్తాయని, కావున అధికారుల ఆదేశాల మేరకు నివారణ మందులను పిచికారి చేసి పంటలను రక్షించుకోవాలన్నారు.

‘పది’లో ప్రతిభ చూపాలి



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న పారా రవి కుమార్

మద్దికెర, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పెరవలి గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు పదో తరగతిలో ప్రతిభ చూపాలని రంగనాథ స్వామి దేవాలయ చైర్మన్ పారా రవికుమార్, మండల విద్యాధికారి రంగస్వామి, ప్రధానోపాధ్యాయురాలు ఉమ అన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదువుకుంటున్న విద్యార్థినీ విద్యార్థులకు పరీక్షల్లో ఎంతో ఉపయోగపడే స్టడీ మెటీరియల్‌ను పారా రవికుమార్ తన సొంత డబ్బులు వెచ్చించి అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఎన్‌జీ నాగరాజు, విశ్వనాథ్ ఉన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి ప్రతిపాదనలు

మద్దికెర, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం మద్దికెర గ్రామంలోని వడ్డె వీధి, బెస్త వీధి, కురువ వీధి ప్రాంతాల ప్రజలకు మంచి నీరు అందించేందుకు సమస్య పరిష్కారానికి రూ.16 లక్షలతో ప్రతిపాదనలు పంపడం జరిగిందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆ ప్రాంతాల్లో ఫ్లోరైడ్ నీరు వస్తుందని ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు దృష్టికి ఆ ప్రాంత ప్రజలు తీసుకెళ్లడంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. ఆ ప్రాంత ప్రజలకు పైపులైన్ వేసి ఫిల్టర్ బెడ్ ద్వారా మంచి నీరు అందిస్తామన్నారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు



గెలుపొందిన జట్టుకు నగదు బహుమతిని అందజేస్తున్న టీడీపీ నాయకులు మిద్దె వెంకటేష్ యాదవ్

తుగ్గలి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ వారికి నచ్చిన క్రీడల్లో పాల్గొనాలని, క్రీడల్లో పాల్గొనడం వల్ల వారికి మానసిక ఉల్లాసంతో పాటు శారీరక ధృడత్వం పెరుగుతుందని.. క్రీడల్లో రాణిస్తే మంచి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని టీడీపీ నాయకులు మిద్దె వెంకటేష్ యాదవ్, సీనియర్ నాయకులు బాలన్న అన్నారు. మంగళవారం మండల పరిధిలోని జొన్నగిరిలో హజరత్ దస్తగిరయ్య స్వామి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా అండర్-14 విభాగంలో కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో పగిడిరాయి జట్టు గెలుపొందడంతో దాత విద్యాకమిటి చైర్మన్ మిద్దె రవికుమార్ రూ.3,116లు, రెండో విజేత జొన్నగిరి జట్టుకు దాత సూరి రూ.2,116 నగదు బహుమతులు అందజేశారు. టీడీపీ నాయకులు మీసాల శేఖర్, బలరాం, తులసి, నారాయణ తదితరులు ఉన్నారు.

రహదారి నిర్మాణానికి నిధులు

దేవనకొండ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పి.కోటకొండ రహదారి నిర్మాణానికి రూ.4.07 కోట్ల నిధులు మంజూరైనట్లు పీఆర్ ఏఈ ఉదయ్ తెలిపారు. కోటకొండ క్రాస్ రోడ్డు నుండి లక్కసారం రోడ్డు వరకు దాదాపు 7.04 కిలోమీటర్ల రహదారి నిర్మాణ పనులు జరగనున్నట్లు తెలిపారు. గుంతలమయంగా మారిన రహదారిపై వాహనదారులు, ప్రజలు ఇబ్బందులకు గురైయ్యారు. నిర్మాణానికి నిధులు మంజూరు చేయడంతో బేతపల్లి సర్పంచు మహేశ్వరరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

గ్రామీణ రోడ్లకు మోక్షం

పత్తికొండ, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి):పత్తికొండ నియోజకవర్గ పరిధిలో రెండు రహదారులకు రూ.9.55కోట్లు నిధులు విడుదల అ య్యాయి. నియోజకవర్గ పరిధిలో క్రిష్ణగిరి మండల పరిధిలో గల కటా రుకొండ, తెగడొడ్డి గ్రామాల నడుమ బీటీ రహదారి 8.23 కోట్లు, బొం దిమడుగుల నుంచి క్రిష్ణగిరి మండలం బొంతిరాళ్ల వరకు బీటీ రహదారి రూ.1.32కోట్ల నిధులు విడుదల అయ్యాయి. ఈగ్రామీణ ప్రాంత రహ దారుల గురించి ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు గతంలో ప్రభుత్వానికి నివేది కలు పంపడంతో పాటు పలుమార్లు స్వయంగా నివేదికలు సమర్పిం చారు. రహదారుల అభివృద్ధికి కృషిచేసిన ఎమ్మెల్యేకు గ్రామప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.

కోసిగిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ సంగీత, రేఖ, రాజేశ్వరి

కోసిగి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోసిగిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బాలికల జూనియర్ కళాశాల, బాలికల హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ మహిళా కన్వీనర్ సంగీత, రేఖ, రాజేశ్వరి తెలిపారు. మంగళవారం కోసిగిలోని మోడల్ స్కూల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్‌కు యువగళం పాదయాత్రలో కోసిగి మండలానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోసిగి మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బాలికల జూనియర్ కళాశాల, హాస్టల్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ మండల కన్వీనర్లు శృతి, నీరజ, రేణుక, శారద ఉన్నారు.

ఘనంగా మారెమ్మవ్వ దేవర



మారెమ్మవ్వకు బోనాలతో నైవేద్యాన్ని తీసుకెళ్తున్న భక్తులు

ఎమ్మిగనూరు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని వెంకటగిరి గ్రామంలో వెలసిన సుంకులమ్మవ్వ, కందనాతి గ్రామంలో వెలసిన మారెమ్మవ్వల దేవర మహోత్సవాలను ఘనంగా నిర్వహించారు. యేటా వరికోతలు కోసే సమయంలో కల్లాల మారెమ్మవ్వ, సుంకులమ్మవ్వల దేవర మహోత్సవాలను గ్రామంలో నిర్వహిస్తారు. మంగళవారం ఉదయాన్నే భక్తులు నైవేద్యాన్ని తీసుకెళ్లి అమ్మవార్లకు సమర్పించి తమ మొక్కులను తీర్చుకున్నారు.

రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన



డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్న సీఐ, పోలీసులు

కోసిగి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియంత్రణ చర్యలు, రోడ్డు భద్రతపై ప్రజలకు కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐ రమేష్ రెడ్డి, ట్రైనీ ఎస్ఐ ఈశ్వర రావు అవగాహన కల్పించారు. మంగళవారం కోసిగిలోని ఆర్టీసీ బస్టాండు, ముఖ్య కూడళ్లలో ప్రజలతో మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలు, ప్రాముఖ్యతను వివరించారు. వాహనదారులు, ప్రయాణికులు ఆటో డ్రైవర్లు పాదాచారులతో మాట్లాడి హెల్మెట్ ధరించడం, సీటు బెల్టు వినియోగం, ఓవర్ స్పీడ్ నివారణ, రాంగ్ డ్రైవ్ చేయరాదని వంటి రోడ్డు భద్రత అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించే ఉద్దేశంతో కోసిగిలోని ముఖ్య కూడళ్లలో రోడ్డుకు సంబంధించిన అవగాహన ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

రేపు హుండీ లెక్కింపు

కౌతాళం, డిశంబరు 9(ఆంధ్రజ్యోతి): ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో గురువారం హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ డిప్యూటీ కమీషనర్, ఈవో వాణి తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి స్వామి వారి మొక్కులు తీర్చుకునేందుకు భక్తులు సమర్పించిన కానుకలు, నగదును దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో ఆలయంలో లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లెక్కింపు భ్రమరాంబ సేవాసమితి సంఘం వారు ఆలయ సిబ్బంది, బ్యాంకు వారు పాల్గొంటారని తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక



పోటీలకు ఎంపికైన విద్యార్థినులు ఈ. అమృత, ఎం. అమృత

కోసిగి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి ఆట్యా పాట్యా జూనియర్ బాలికల పోటీలకు కోసిగి కేజీబీవీ విద్యార్థినులు ఈ.అమృత, ఎం.అమృతలు ఎంపికయ్యారనీ పీఈటీ సుమ, ప్రిన్సిపాల్ షభానా అజ్మీన్‌లు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ 12 నుంచి 14 వరకు ఛండీఘడ్‌లో జరిగే ఆలిండియా జూనియర్ నేషనల్ పోటీలలో పాల్గొనేందుకు కర్నూలు జిల్లా జట్టు మంగళవారం కర్నూలు నుంచి వెళ్లారు. కోసిగి కేజీబీవీ పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థినులు జాతీయ స్థాయి ఆట్యా పాట్యా పోటీలకు ఎంపిక కావడం పట్ల కోసిగి మండల ప్రజలు, పాఠశాల ఉపాధ్యాయునీలు క్రీడాకారులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాగరత్నమ్మయ్య, వెంకటలక్ష్మి, సుమంగళ, జయపాల్, వినోద్ పాల్గొన్నారు.

కమిషనర్‌కు అభినందనలు



కమిషనర్‌కు అభినందనలు తెలుపుతున్న కార్మికులు

ఎమ్మిగనూరు టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలని ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో 19 రోజులుగా మున్సిపల్ కార్యాలయం ఎదుట వారికి ఉద్యోగాలు కల్పించాలంటూ దీక్షలు చేపట్టారు. పోరాట ఫలితంగా ఉద్యోగాలు కల్పించిన మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి ఉద్యోగాలు పొందిన కార్మికులు అభినందనలు తెలిపారు. ఏఐటీయూసీ నాయకులు వీరేష్, విజయేంద్రలు మాట్లాడుతూ ఈ పోరాటంలో సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్మికుల బాధలు తెలుసుకొని వారికి ఉద్యోగాలు కల్పించిన గంగిరెడ్డిని వారి కార్యాలయంలో నాయకులు సత్కరించారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత



చెక్కును బాధితులకు అందజేస్తున్న పన్నాగ వెంకటేష్ స్వామి

మంత్రాలయం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రచ్చుమర్రి గ్రామానికి చెందిన పింజరి చిన్నఉసేనికి మంజూరైన సీఎం సహాయ నిధి చెక్కు మంజూరు కావడంతో మంగళవారం మంత్రాలయం ప్రైవేటు వసతిగృహంలో టీడీపీ నియోజకవర్గ సీనియర్ నాయకులు పన్నాగ వెంకటేష్ స్వామి అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిన్న సుంకప్ప, ఏబు, నరసింహా, సున్నం రఘు, విద్యాకమిటి ఛైర్మన్ సున్నం గురురాజ్, రామయ్య, గోవిందు, వన్నూరప్పలు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ. లక్ష విరాళం

మంత్రాలయం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠానికి కర్ణాటకలోని తముకూరుకు చెందిన జయలక్ష్మి ప్రహ్లాదరావు రూ. లక్ష అన్నధానానికి విరాలం ఇచ్చినట్లు ఏఏఓ మాదవ శెట్టి, మఠం మేనేజర్లు ఎస్‌కే శ్రీనివాస రావు, సురేష్ కోనాపూర్‌లు తెలిపారు. మంగళవారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకొని రూ. లక్ష నగదును అన్నధానానికి జయలక్ష్మి ప్రహ్లాదరావు ఇచ్చారు. ధాతకుటుంబానికి మఠం పండితులు శేష వస్త్రం పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో శ్రీపాధాచార్, నరసింహ దేశాయ్, అనంత పురాణిక్ లు పాల్గొన్నారు.

ఆదోనిని జిల్లా చేసే వరకు

పోరాటం ఆగదు

నేటి నుంచి నిరాహార దీక్షలు ప్రారంభం



సీఐకి వినతిపత్రం ఇస్తున్న బీఎస్ఎస్ నాయకులు

మంత్రాలయం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆదోనిని జిల్లాగా ప్రకటించేంతవరకు పోరాటం ఆగదని బీఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు అమ్రేష్ అన్నారు. ఆదోని జిల్లా చేయాలని మంత్రాలయంలో 12నుంచి చేపట్టే రిలేదీక్షలకు అనుమతి మంజూరు చేయాలని మంగళవారం సీఐ రామాంజులుకు బీఎస్ఎస్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. నాయకులు మాట్లాడుతూ దేశంలోనే అత్యంత వెనుకబడిన ప్రాంతం ఆదోని డివిజన్ అన్నారు. ఇక్కడ ప్రజల ఆకాంక్షల మేరకు ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదోనిని జిల్లా చేస్తే పరిపాలన సౌలభ్యం ఉంటుందన్నారు. ఆదోనికి చుట్టుముట్టు ఉన్న నియోజకవర్గాల్లోని గ్రామాలు 50 కీమీ దూరంలోనే ఉన్నాయన్నారు. జిల్లా అయితే ఆదోని ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటుతో పాటు ప్రాజెక్టులు వస్తాయన్నారు. ప్రభుత్వం స్పందించి ఆదోనిని జిల్లాగా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జిల్లా నాయకులు ప్రసన్న కుమార్, స్థానిక నాయకులు స్వామినాథం, బాలస్వామి, దేవా, ఏసన్న, చిన్న బాలస్వామి, ఆనంద్, సుందరరాజు, ప్రసాద్‌లు పాల్గొన్నారు.

మద్దతు ఇవ్వాలి: జేఏసీ

నందవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఆదోని జిల్లాగా ప్రకటించడం కోసం బీజేపీ సహకారం అవసరమని ఆదోని జిల్లా సాధన కమిటి కోఆర్డినేటర్(జేఏసీ) కృష్ణ అన్నారు. మంగళవారం నందవరం బీజేపీ కార్యాలయంలో ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జి గురురాజారావును మద్దతు కోరారు. బుధవారం నుంచి రిలే నిరాహార దీక్షలు చేపడతున్నామని, రిలే నిరాహార దీక్షలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎల్లెల్సీ కాలువ ఛైర్మన్ రామన్నగౌడు, కె.శివ, దానీయేలు, దండువీరేష్, జేఏసీ నాయకులు ఉదయ్, ఖాజా, రఘు, అఫ్రిద్ పాల్గొన్నారు.

కౌతాళం: ఆదోని జిల్లా కోసం అందరం కలిసి మద్దతు తెలిపి ఆదోనిని జిల్లాగా సాధించుకుందామని కౌతాళం జేఏసీ కౌతాళం మండల కన్వీనర్ మారుతీ మోహన్ తెలిపారు. కౌతాళంలో మంగళవారం మండల జేఏసీ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆదోని జిల్లా సాధన కోసం ప్రతి ఒక్కరు పార్టీలకతీతంగా కలిసి బుధవారం చేపడుతున్న ర్యాలీలో పాల్గొని తమ వంతు మద్దతు తెలిపి ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు. ఆదోని జిల్లా సాధన కోసం ఆదోనిలో బుధవారం సంపూర్ణ బంద్ పాటిస్తున్నారని, వారికి మద్దతుగా కౌతాళంలో ఉదయం 9గంటలకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి ర్యాలీ బయలుదేరి అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు శేషిరెడ్డి, గ్రామ సర్పంచ్ పాల్‌దినకరన్, జగదీష్, లక్ష్మణాచారి పాల్గొన్నారు.



నందవరం: బీజేపీ నాయకుడు గురురాజారావుకు వినతి పత్రం ఇస్తున్న జేఏసీ నాయకులు



కౌతాళం: మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

కొత్తిమీర రైతులను ఆదుకుంటాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



రైతులతో మాట్లాడుతున్న డివిజన్ హార్టికల్చర్ అధికారి శ్రీవాణి

గోనెగండ్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కొత్తి మీర రైతులను ఆదుకునేందుకు చర్యలు చేడుతున్నామని ఎమ్మిగనూరు డివిజన్ హార్టికల్చర్ అధికారి శ్రీవాణి తెలిపారు. సోమవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'పడిపోయిన కొత్తిమీర ధర' అలాగే 'మిరప రైతులను ముంచుతున్న ముసురు' అనే రెండు శీర్షికలు ప్రచురితమయ్యాయి. హార్టికల్చర్ శాఖ అధికారులు స్పందించి. మంగళవారం గోనెగండ్లలోని కొత్తిమీర, మిరప, టమోటా, బంతిపూలు, కనకంబారాల తోటలను పరిశీలించారు. కొత్తి మీర రైతులతో ఆమె మట్లాడుతూ ధర పలకని పంటలను ఎందుకు సాగు చేసుకున్నారని ప్రశ్నించారు. అయితే రైతులు నెల రోజుల పంట కాబట్టి సాగు చేసుకున్నామని బదులిచ్చారు. కొత్తి మీరకు గిట్టు బాటు ధర కల్పించుందుకు గాను జిల్లా హార్టికల్చర్ అధికారితో మాట్లాడి రైతుబజార్‌లలో గిట్టు బాటు ధర కల్పించేలా కృషి చేస్తామని అన్నారు. అలాగే ముసురు మంచుతుండడంతో మిరప పంట కూడా బూడిదతెగులు, ఆకు మచ్చ, వైరస్ సోకిందన్నారు. దీని నివారణకు రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది షఫీ రైతులు పాల్గొన్నారు.

దేవరను భక్తితో జరుపుకోవాలి



పీఠాధిపతిని సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

మంత్రాలయం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మంత్రాలయంలో ఈనెల 16, 17న జరిగే దేవర ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని మఠం పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు అన్నారు. మంగళవారం గ్రామ పెద్దలతో కలిసి దేవర ఉత్సవాల ఏర్పాట్లును మారికంబాదేవి, దేవమ్మ, మంచాలమ్మ తదితర దేవాలయాలను పరిశీలించారు. దేవర ఉత్సవాలకు శ్రీమఠం నుంచి పూర్తి సహకారం అందిస్తామని పీఠాధిపతి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పన్నాగ వెంకటేష్ స్వామి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య, వరదరాజులు, గోరుకల్లు కృష్ణ స్వామి, జనార్ధన్ రెడ్డి, ఎంపీటీసీ వెంకటేష్, సుంకప్ప పాల్గొన్నారు.

పోలీసు స్టేషన్ తనిఖీ



పోలీసులతో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

మంత్రాలయం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పోలీసు స్టేషన్‌ను మంగళవారం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ శుభ్రత, మౌలిక సదుపాయాలు, పోలీసు సిబ్బంది పనితీరు, నేరాలు, రోడ్డు ప్రమాదాలు, చోరీ, హత్యల రికార్డులను తనిఖీ చేశారు. రికార్డుల నిర్వహణపై స్థానిక ఎస్ఐ శివాంజల్‌ను అభినందించారు. మంత్రాలయంలో ట్రాఫిక్ నియంత్రణ, శ్రీమఠం పటిష్ట భద్రతకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ ఉన్నారు.

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ చిరంజీవి

ఎమ్మిగనూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రభుత్వం మంజూరు చేసిన గృహాల నిర్మాణాలు వేగంగా పూర్తిచేసుకునేలా సచివాలయం అమినీటీస్ సెక్రటరీలు చర్యలు తీసుకోవాలని హౌసింగ్ పీడీ చిరంజీవి సూచించారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డి ఆధ్వర్యంలో సచివాలయం అమినిటీస్ సెక్రటరీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏఏ వార్డులో గృహనిర్మాణాలు ఎంతమేరకు పూర్తి అయ్యాయో వివరాలు తెలుసుకున్నారు. పీడీ మాట్లాడుతూ నిర్దేసించిన సమయంలోపు టార్గెట్‌ను పూర్తి చేయాలని ఆదేశించారు. ఏమైన సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో హౌసింగ్ డీఈఈ ప్రసాద్, ఏఈ కుమార్, వర్క్ ఇన్స్‌పెక్టర్ మధులు పాల్గొన్నారు.

బాలుర ఎస్సీ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలి



ఎంఈవోకు వినతి పత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

గోనెగండ్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): గోనెగండ్లలో బాలుర ఎస్సీ హస్టల్‌ను పాత ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేయాలని బీఎస్పీ తాలుకా అధ్యక్షుడు ఆంధ్రి బంగారప్ప, బాఎస్ఎఫ్ రాయలసీమా ఇన్‌చార్జి బొగ్గుల హనుమన్న డిమాండ్ చేశారు. మంగళవారం ఎంఈవో కార్యలయంలో ఎంఈవో నీలకంఠకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఎస్పీ తాలుకా కోశాధికారి బాలు, వీరపోగు లక్ష్మన్న పాల్గొన్నారు.

పంటల అవశేషాలను పొలంలో కాల్చవద్దు



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ, ఏవో

గోనెగండ్ల, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సాగు చేసే పొలాలలో తాము పండించిన పంటల అవశేషాలను కాల్చరాదని, వాటిని పొలంలో కలియదున్నాలని ఏడీవో మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత రైతులకు సూచించారు.మంగళవారం తిప్పనూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు సాగు చేసుకున్న పలు పంటలను వారు పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పండించిన పంటలను పొలంలో కాల్చడం వల్ల వాతవరణం లోకి కార్బన్ డైఆక్సయిడ్, మిథేన్, నైట్రెట్ ఆక్సియిడ్ కలిసి వాతావరణ కాలుష్యం పెరిగి వేడి పెరుగుతుందన్నారు. మొక్కజొన్న పంటలో జింక్‌లోపం కనిపిస్తుందని, కాబట్టి ప్రతి మూడు పంట సాగు అనంతరం ఎకరంకు 20 కేజిల జింక్‌సల్ఫేట్‌ను పొలంలో చల్లుకోవాలన్నారు. కత్తెర పురుగునివారణకు ఎమామెక్టిన్ బెంజోయేట్ 0.3 మిల్లీ గ్రాములు ను ఒక లీటర్‌నీటిలో కలుపుకొని పిచికారి చేయాన్నారు. వేరుశనగ కు తిక్కఆకుపచ్చ తెగులుకు హేక్సాకోనాజోల్ 2 మిల్లీలీటర్లును ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే పలు పంటల రోగాలకు మందులను సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది పులిరాజు, అరుణ, తస్లీమా, గ్రామ రైతులు పాల్గొన్నారు.

కత్తెర పురుగును నివారించుకోవాలి: ఏవో

నందవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులు మొక్కజొన్నలో కత్తెర పురుగు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారి సరిత తెలిపారు. మంగళవారం మండలంలోని హలహర్వి గ్రామంలో పోలం పిలుస్తుంది కార్యక్రమం సందర్భంగా మొక్క జొన్న, జొన్న, శనగ పంటలను పరిశీలించారు. కత్తెర పురుగు నివారణ కోసం రైతులకు సూచనలు చేశారు. కారక్రమంలో రైతులు పాల్గొన్నారు.

భోజనం సక్రమంగా వడ్డించాలి

నందవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనం సక్రమంగా చేయకపోతే నిర్వాహకులను తొలగిస్తామని ఎంపీడీవో పుల్లయ్య హెచ్చరించారు. మంగళవారం మండలంలోని హలహర్వి గ్రామంలో ఎంపీపీ స్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. రుచికరమైన భోజనం వడ్డించాలన్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఏజెన్సీని తొలగిస్తామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సందీప్, ఏఈ బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సుజాత, శశిధర్, గ్రామ నాయకులు నాగరాజు, గోవిందు పాల్గొన్నారు.

ప్రభుత్వం ప్రకటించిన ధర ఇవ్వాలి



మిల్లులో పత్తిని పరిశీలిస్తున్న తహసీల్దార్

నందవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పత్తి రైతుకు ప్రభుత్వం ప్రకటించిన ధరనే ఇవ్వాలని మిల్లు నిర్వాహకులకు తహసీల్దారు శ్రీనివాసులు సూచించారు. మంగళవారం మండలంలోని ముగతి గ్రామం దగ్గర ఉన్న మురారి పత్తి జిన్నింగ్ మిల్లును ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. రైతులందరికీ గిట్టుబాటు ధర లభిస్తుందా అని అడిగి తెలుసుకున్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ తేమ శాతం ఎక్కువగా ఉన్న పత్తి ధర కొంచం తక్కువగా ధర పలుకుందని తెలిపారు. రైతులు రోడ్డు మీద వాహనాలు ఆపుతుండడంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారుతుందని, పత్తి వాహనాలు ఆపుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గం చూడాలని మిల్లు నిర్వాహకులకు సూచించారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం: టీడీపీ



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

నందవరం, డిసెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాలాభివృద్ధి, రైతుల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ ధ్యేయమని సోమలగూడురు టీడీపీ నాయకులు వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, రామలింగారెడ్డి అన్నారు. మంగళవారం సోమలగూడురు గ్రామంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలకు ప్రత్యేక సమావేశం జరిగింది. పంచాయతీకి చెత్త సేకరణ కోసం కొత్తగా వచ్చిన ట్రాక్టర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో గోపాల్‌రెడ్డి, రజకసంఘం నాయకులు చంద్ర, నాగేష్ పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి



క్రీడాకారులకు టీషర్టులు పంపిణీ చేస్తున్న నాయకులు

నందవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని మాజీ జెడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ పుష్పావతి, టీడీపీ మండల పార్టీ కన్వీనర్ కాశీంవలీ, సహకార సంఘం మండల అధ్యక్షుడు దర్మాపురం గోపాల్ అన్నారు. మంగళవారం నందవరం క్రికెట్ జట్టుకు రూ 15వేలు వెచ్చించి టీషర్టులు, బనీయన్లు క్రికెట్ కిట్టును పుష్పావతి అందజేశారు. నందవరం నుంచి జిల్లా స్థాయిలోనే కాక రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మస్తాన్, సామేలు, రహిమాన్ పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడికి మాతృ వియోగం



మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్

నందవరం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలో ఇబ్రహింపురం టీడీపీ సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి తల్లి ఉమాదేవి(88) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. ఆమె భర్త లోకనాథ్‌రెడ్డి మాజీ ఎంపీటీసీ, మండల వైస్ ఎంపీపీగా పని చేశారు. మాజీ మంత్రి బీవీ మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు. మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి, గడ్డంనారాయణరెడ్డి, రాజీవ్‌రెడ్డి టీడీపీ సీనియర్ నాయకులు మాజీ జడ్పీ వైస్ ఛైర్మన్ పుష్పావతి, మండల టీడీపీ కన్వీనర్ కాశీంవలీ, సహకార పంఘం మండల అధ్యక్షుడు ధర్మాపురం గోపాల్, పేట సామేలు నివాళి అర్పించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

భూమాతను రక్షించుకోవాలి

కోసిగి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో భూమాతను రక్షించుకోవాల్సిన అందరి బాధ్యత అని మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ అన్నారు. ధర్తీ మాతా బచావో.. భూమాతను కాపాడుకుందాం.. కమిటీలో భాగంగా మంగళవారం సజ్జలగుడ్డం గ్రామంలో భూమాత రక్షణ కమిటి గ్రామస్థులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి వరప్రసాద్ మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించాల్సిన అవసరం ఎంతైనా ఉందని, సేంద్రీయ ఎరువుల వాడకం వల్ల భూమి ఆరోగ్యం పెంపొందించడమే కాకుండా. మన తినే ఆహారంలో పురుగ మందుల అవశేషాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పైరు 35 నుంచి 45 రోజుల వరకు నానో యూరియా, నానో డీఏపీ వాడడం వల్ల మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. పంట అవశేషాలు భూమిలో కలియ దున్నుకోవాలని, భూమిలో కలిసేందుకు వేస్టే డీకంపోజర్ వంటివి వాడాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు ఎస్.అయూబ్ బాషా, పంచాయతీ కార్యదర్శి వినోద్ నాయక్, గ్రామ పెద్దలు మల్లికార్జున రెడ్డి రైతులు పాల్గొన్నారు.

హోరాహోరీగా క్రికెట్ టోర్నీ



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకుంటున్న ట్రైనీ ఎస్ఐ మల్లికార్జున

ఎమ్మిగనూరు, డిసెంబరు 9 (ఆంధ్ర జ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో జాతర సందర్భంగా నిర్వహించిన బీవీ స్మారక అంతరాష్ట్ర క్రికెట్ టోర్నీ హోరా హోరీగా సాగింది. మంగళవారం పోలీసు సిబ్బంది ఏ టీం, బీ టీంలుగా తలపడ్డాయి. ఏ టీం కెప్టెన్‌గా నిరంజన్‌రెడ్డి, బీ టీం కెప్టెన్‌గా గూడుబాషా వ్యవహరించారు. మొదట బరిలో దిగిన బీ టీం 10 ఓవర్లలో 89 పరుగులు తీయగా, ఏటీం 10 ఓవర్లలో 54పరుగులు తీసి ఓటమిపాలైంది. ఏటీంలో 35 పరుగులు సాధించి ట్రైనీ ఎస్ఐ మల్లికార్జున మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ అవార్డును కైవసం చేసుకున్నారు. గెలుపొందిన బీటీం వారం రోజుల తర్వాత మున్సిపల్ కార్యాలయ సిబ్బందితో తలపడనున్నారు. ఈ క్రికెట్ పోటీలో సీఐలు మంజునాథ్, శ్రీనివాసులు, ఎస్ఐలు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాసులు, మధుసుదన్‌రెడ్డి, శ్రీనివాసులు, ట్రైనీ ఎస్ఐ మల్లికార్జున, ఈశ్వర్, పోలీసు సిబ్బంది కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

రాఘవేంద్రుడి సన్నిధిలో సినీ గాయకుడు మనో

మంత్రాలయం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ప్రముఖ సినీ గాయకుడు, సినీ నటుడు, డబ్బింగ్ ఆర్టిస్ట్ మనో(నాగుర్‌బాబు) మంగళవారం సతీ సమేతంగా మంత్రాలయం వచ్చారు. ఈయనకు మఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపీ నరసింహమూర్తి, రాఘవేంద్ర, జయతీర్థఆచార్యులు ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు.